ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 15 నవంబరు 2025

కుంటను పూడ్చి.. రూ.కోటి కొట్టేశారు

- వైసీపీ నేతలతో రెవెన్యూ అధికారుల లాలూచి
- ఆన్‌లైన్ చేయించి అమ్మకం
- ఇదీ వైసీపీ హయాంలో అధికారులు, నేతల తీరు
- స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

వైసీపీ హయాంలో డబ్బులు ఇస్తే చాలు.. ఆ తహశీల్దారు కార్యాలయంలో రికార్డులు తారుమారు చేయవచ్చు. అధికారులకు, నాయకులకు డీల్ కుదిరితే ఎవరి భూమినైనా స్వాధీనం చేసుకుని రూ.కోట్లు సంపాదించవచ్చు. అధికారులు అడిగింది ఇస్తే చాలు.. ప్రభుత్వ భూములను కూడా ఆన్‌లైన్ చేసి చేతిలో పెడతారు. నిబంధనలకు విరుద్ధంగా పుల్లంపేట తహశీల్దారు కార్యాలయంలో జరిగిన పనులపై ఉన్నతాధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. అన్నీ సక్రమంగానే ఉన్నాయంటూ రిపోర్టు కూడా పంపిస్తారు. కంచే చేను మేసిన చందంగా వైసీపీ హయాంలో రెవెన్యూ అధికారులే ప్రభుత్వ భూములను అమ్మకాలకు పెట్టిన వ్యవహారం ఇప్పుడు వెలుగులోకి వస్తోంది.



రామనూరుకుంట కోసం వదిలిన సెంటు స్థలం

పుల్లంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు రెవెన్యూ అధికారులను గుప్పిట్లో పెట్టుకుని వాగులు వంకలు చెరువులు కొండలు సైతం ఆక్రమించేశారు. కొన్ని మండలాల్లో వేలాది ఎకరాలు ఆన్‌లైన్ చేసేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని బ్రహ్మంగారి మఠంలో దాదాపు 15వేల ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై 20 బృందాలతో ఆర్డీవో సర్వే నిర్వహిస్తున్నారు. పుల్లంపేట మండలంలోనూ వైసీపీ హయాంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని సమాచారం. ఇంత పెద్దస్థాయిలో అన్యాక్రాంతం అయ్యేందుకు రెవెన్యూ అధికారులు పూర్తి సహకారం అందించి కోట్ల రూపాయలు దండుకున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇస్తే కుంటలను, చెరువులను మాయం చేసినా పట్టించుకోరనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతంలో పనిచేసిన తహశీల్దారు వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆన్‌లైన్ చేసి అనర్హులకు కట్టబెట్టారంటే ఎంత దండుకున్నారో అర్థం చేసుకోవచ్చు.

పుల్లంపేట మండల పరిధిలోని అనంత సముద్రం పంచాయతీలో సర్వేనంబరు 1389/1, 1389/2, 1389/3లో ఉన్న 15 ఎకరాల భూమిని గతంలో ఇతర ప్రాంతాలవారికి డీకేటీ పట్టా ఇచ్చారు. పట్టా పొందినవారు ఎప్పుడూ ఈ భూమి ముఖం కూడా చూసి ఉండరు. 1389/2 సర్వేనంబరులో రామనూరు కుంట ఉండేది. పక్కనే గుట్టపై నుంచి వర్షపునీరు ఈ కుంటలోకి చేరేది. అప్పట్లో రెవెన్యూ అధికారులు తెలిసో తెలియక పట్టా ఇచ్చారు. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉపాధిహామీ పథకం కింద కుంట అభివృద్ధి పనులు కూడా చేశారు. ఇక్కడ భూములకు రెక్కలు రావడంతో వైసీపీ హయాంలో నాయకుల కన్ను దీనిపై పడింది. డీకేటీ పట్టా పొందినవారు ఎక్కడున్నారో తెలియదు. అందువల్ల ఆ భూములు ఆన్‌లైన్‌కు కూడా నోచుకోలేదు. ఇంకేముంది.. కుంట మాయమైంది. మొత్తం భూమిని చదును చేశారు. ఐదెకరాల పట్టా రూ.33 లక్షలకు అమ్మకానికి పెట్టారు. కొన్న వ్యక్తి పేరుమీదే ఆన్‌లైన్ కూడా చేయిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో అదే పంచాయతీకి చెందిన అరటికాయల వ్యాపారి ముందుకు వచ్చారు. దాని చుట్టూ ఉన్న రెండు సర్వేనెంబర్లలోని భూమిని కూడా ఆ వ్యాపారి రూ.66 లక్షలకు కొనేశారు. డబ్బు చెల్లింపు పూర్తయిన వెంటనే తహశీల్దారుకు వాటా ముట్టచెప్పడంతో కొన్నవారి పేరుతోనే ఆన్‌లైన్ చేశారు. 1389/3 సర్వేనంబరులోని ఐదెకరాల భూమిని విక్రయించినా అది మాత్రం ఎందుకో ఆన్‌లైన్ కాలేదు.



సర్వేనంబరు 1389/2లో కుంటను పూడ్చివేసి రూ.కోటికి అమ్మిన స్థలం ఇదే..

సెంటు స్థలంలో కుంట..!

ఇక రామనూరు కుంట విషయానికి వస్తే ఐదెకరాలు ఉన్న కుంటను పూడ్చివేసి నామమాత్రంగా ఇదే కుంట అని చూపించేందుకు సెంటు స్థలంలో ఏర్పాటు చేశారు. ఇదంతా చూస్తుంటే రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులకు ఎంతమేర సహకరించారో అర్థం చేసుకోవచ్చు. ఇందులో తహశీల్దారుకు 10శాతం వాటా అందినట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లోని వారు ఎక్కువగా ఇక్కడ పట్టాలు పొంది ఎంచక్కా నాయకులు రెవెన్యూ అధికారులతో లాలూచిపడి ఆన్‌లైన్ చేయించి అమ్మేసినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. అక్రమ ఆన్‌లైన్, అమ్మకంపై స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పుల్లంపేట తహశీల్దారు పుల్లారెడ్డిని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో వివరణ కోరగా తనకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని అన్నారు. ఫిర్యాదులు వస్తే పరిశీలించి నోటీసులు అందజేస్తామన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో.. కొనసాగుతున్న విచారణ

- దొరకని బెంగళూరు కిడ్నీ డాక్టర్ ఆచూకీ

మదపనల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కేంద్రంగా జరిగిన కిడ్నీ ఆపరేషన్ కేసులో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కీలకంగా భావిస్తున్న ఆరుగురి నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా, కిడ్నీ ఆపరేషన్ చేసిన బెంగళూరుకు చెందిన వైద్యుడి కోసం పోలీసు బృందాలు బెంగళూరు, గోవాకు వెళ్లాయి. అయితే ఇప్పటివరకూ ఆ డాక్టర్ ఆచూకీ దొరకలేదని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు గ్లోబల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ ఆంజనేయులుతో పాటు మదనపల్లె, కదిరి ఆసుపత్రుల డయాలసిస్ కేంద్రాల టెక్నీషియన్లు బాలరంగడు, మెహరాజ్, వైజాగ్‌కు చెందిన సూరిబాబు, గాజువాకకు చెందిన కిడ్నీ మధ్యవర్తులు పద్మ, సత్యలు స్థానిక డీఎస్పీ కేంద్రంగా, తర్వాత సీసీఎస్ పోలీసులు ఏరియాలను మార్చి వేర్వేరుగా విచారిస్తున్నట్లు తెలిసింది. వీరి నుంచి కూడా ఇప్పటి వరకూ ఖచ్చితమైన సమాచారం రాలేదని తెలిసింది. అంతకంటే ముందుగా వైజాగ్ ప్రాంతానికి చెందిన యమున(29) మృతికి కారణమైన బెంగళూరు కిడ్నీ డాక్టర్ దొరికితే, గోవాకు చెందిన కిడ్నీ రిసీవర్ ఆచూకీ దొరికినట్లేనని భావిస్తున్నారు. ఇదిలా వుండగా మదనపల్లె జిల్లా ఆసుపత్రి డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ శాశ్వతిని హైదరాబాద్‌లోని అపోలో యాజమాన్యం సస్పెండ్ చేయగా, మదనపల్లె, కదిరి కేంద్రాల టెక్నీషియన్లను కిడ్నీ రాకెట్ వెలుగులోకి వచ్చిన మొదటి రోజునే విధుల నుంచి తొలగించింది. ఇక ప్రధాన నిందితునిగా భావిస్తున్న గ్లోబల్ ఆసుపత్రి అధినేత డాక్టర్ ఆంజనేయులుపై అన్నమయ్య, చిత్తూరు జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల బృందం వేర్వేరుగా విచారణ చేపట్టింది. అయితే ప్రభుత్వానికి ఇచ్చే నివేదికలో డాక్టర్ స్టేట్‌మెంట్ కూడా ప్రాధాన్యం కావడంతో చిత్తూరు జిల్లా వైద్య బృందం మరోసారి శుక్రవారం మదనపల్లెకు విచ్చేసింది. ఈ క్రమంలో పోలీసుల అదుపులో ఉన్న ఆంజనేయులు నుంచి స్టేట్‌మెంట్ తీసుకోవాలని అటు ఎస్పీ, ఇటు డీఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ అంశం సాంకేతికంగా ఇబ్బంది వచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు తిరస్కరించినట్లు చెబుతున్నారు. డాక్టర్ ఆంజనేయులు తమ అదుపులో లేరని, గాలిస్తున్నట్లు చెప్పి పంపినట్లు తెలిసింది. ఎఫ్ఐఆర్, పోలీసుల నివేదిక ఆధారంగా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చారు. అయితే ఇక డాక్టర్ నుంచి వాగ్మూలం తీసుకుని ఇచ్చే నివేదిక ఆధారంగా ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

యూపీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ (ప్రిలిమ్స్)కు హాజరయ్యే జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన నిరుద్యోగ యువత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తోందని షెడ్యూల్డ్ కులాల సేవా సంస్థ అధికారి దామోదర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్స్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారని అందులో పేర్కొన్నారు. డిసెంబరు 10 నుంచి ఏప్రిల్ 10, 2026 వరకు తరగతులు నిర్వహిస్తారని, ఈ శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా వసతి, భోజన సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. ఈ శిక్షణకు స్క్రీనింగ్ పరీక్ష, మెరిట్ ఆధారంగా మొత్తం 340 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. మొత్తం సీట్లలో 33 శాతం మహిళలకు కేటాయించారని, అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన నిరుద్యోగ యువత 2025 నవంబరు 16 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

హార్సిలీహిల్స్‌లో కలెక్టర్, ట్రైనీ కలెక్టర్లు

బి.కొత్తకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, మదనపల్లి సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి గురువారం పర్యటించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్‌కు చెందిన 12మంది ఐఏఎస్ అధికారులుగా పోస్టింగ్ తెచ్చుకుని విధినిర్వహణలో శిక్షణ కోసం జిల్లాకు కేటాయించబడ్డారు. వీరిలో ఆరుగురు రాయచోటి, మరో ఆరుగురు మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం కేంద్రంగా వారం రోజులుగా శిక్షణ పొందారు. మునిసిపల్, రెవెన్యూ, సాధారణ పరిపాలనా అంశాలపై సంబంధిత అధికారులు, కార్యాలయాలు, ప్రదేశాలు తిరిగి నిశితంగా పరిశీలించారు. గురువారం ఈ ట్రైనీ కలెక్టర్లు అందరూ హార్సిలీహిల్స్‌కు చేరుకోగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ వారితో సమావేశమయ్యారు. శిక్షణపై చర్చించారు. త్వరలో విధుల్లో చేరనున్న ట్రైనీ కలెక్టర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం హిల్స్‌పై ఓ రెస్టారెంట్‌లో అందరితో కలిసి విందులో పాల్గొన్నారు. కలెక్టర్‌తో పాటు, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, బి.కొత్తకోట తహసీల్దార్ బావాజాన్ వున్నారు. కాగా ఈ పర్యటనపై మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం విశేషం.

7 వ్యక్తి దారుణ హత్య

అయోమయం పరీక్షలు

- 1, 2 తరగతుల విద్యార్థులకు 80 మార్కుల ప్రశ్నపత్రం
- సమ్మెటివ్ పరీక్షలపై మండిపడుతున్న ఉపాధ్యాయులు



సమ్మెటివ్ పరీక్షలపై ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న కార్టూన్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే పిల్లలు భయపడకూడదు. చదువుపట్ల ప్రేమ పెరగాలి. అదే విద్యా సంస్కరణల నిజమైన లక్ష్యం కావాలి. అయితే ప్రస్తుతం జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షల్లో చిన్నారులు అయోమయం గందరగోళ పరిస్థితుల్లోకి వెళ్లారు. జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు 80మార్కుల ప్రశ్నపత్రం చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం వేస్తుంది. ప్రాథమిక విద్యార్థుల మనసులనూ, మానసిక శక్తిని పరిగణనలోకి తీసుకోకుండా పరీక్షల విధానాన్ని రూపొందిస్తోన్న విద్యాశాఖ అధికారుల తీరుపై ఉపాధ్యాయ వర్గం తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తోంది. 1, 2 తరగతుల చిన్నారులకు 80 మార్కుల సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించడం సరైందా? అనే ప్రశ్న ఇప్పుడు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులకే చెమటలు..!

పరీక్ష సమయం 2.30 గంటలు నిర్ణయించగా, ప్రశ్నల పొడవు, కఠినత చూసి ఉపాధ్యాయులకే చెమటలు పట్టే పరిస్థితి. ఇది పిల్లల పరీక్షా పత్రమా, లేక పీజీ విద్యార్థుల పరీక్ష పత్రమా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల మానసిక స్థితిని అసలు పరిగణనలోకి తీసుకోలేదు. ఫార్మేటివ్ ప్రశ్నపత్రాలు సిలబస్‌కు తగనివి. వీటిలో శాస్త్రీయత ఏమాత్రం లేదు. చిన్నారులు విద్యపై కాకుండా, పరీక్షల భారంతో చదువుపట్ల విరక్తి చెందే పరిస్థితి వస్తుంది. ఇలాంటి ప్రశ్నపత్రాలు రూపొందించే వారిని మానసిక వైద్యులకు చూపించాల్సిందే. పిల్లల స్థాయి, వయస్సు ఏంటో తెలుసుకోకుండా పేపర్లు సిద్ధం చేస్తున్నారు అంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం సమ్మెటివ్ మూల్యాంకనం అంటే విద్యార్థి నేర్చుకున్న విషయాన్ని అంచనా వేయడం. కానీ ఇక్కడ అది శిక్షగా మారింది. ఈ విధమైన అశాస్త్రీయ మూల్యాంకన విధానాలు పిల్లల్లో భయం, నిరుత్సాహం కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రశ్నపత్రం మార్చాలి

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, పరీక్షల విభాగం డైరెక్టర్ తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల నుంచి అభిప్రాయాలు సేకరించి, ప్రశ్నపత్రాల రూపకల్పనలో మార్పులు తేవాలి. లేకపోతే పిల్లల మానసిక ఆరోగ్యంపైనే దుష్ప్రభావం పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

35 నియోజకవర్గాల్లో రైతుబజార్ల ఏర్పాటుకు చర్యలు

- మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిధిలోని 8 జిల్లాల్లోని 35 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నూతనంగా రైతుబజార్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కడప డిప్యూటీ డైరెక్టర్ లావణ్య పేర్కొన్నారు. పీలేరులో రైతుబజారు నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలోనూ రైతుబజార్లు ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. రైతుబజార్లు లేని చోట్ల ప్రభుత్వ స్థలాలు ఏ మేరకు అందుబాటులో ఉన్నాయో క్షేత్ర పరిశీలన జరిపి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. పీలేరులో రూ.26 లక్షలతో రైతుబజారు నిర్మించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపామని, మరో వారం రోజుల్లో నిధులు మంజూరవుతాయని ప్రకటించారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. కడప రీజియన్ పరిధిలోని 8 జిల్లాల్లో ఈ ఏడాది రూ.145 కోట్ల సెస్ వసూళ్ల లక్ష్యం కాగా ఇప్పటికి రూ.69 కోట్లు వసూలు చేసి 47శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. అందులో రూ.9కోట్ల లక్ష్యానికి గానూ రూ.6.5 కోట్లు వసూలు చేసి జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. అనంతరం ఆమె పీలేరు మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, కార్యదర్శి హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో రైతుబజారు స్థలాన్ని పరిశీలిస్తున్న డీడీఎం లావణ్య

యువకుడిపై కత్తితో దాడి

- పరిస్థితి విషమం

రామసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామంలో ఓ వ్యక్తి యువకునిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పెద్దకురప్పల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు అశోక్‌కుమార్(28)కి ఇదే గ్రామానికి చెందిన హరితో కొంతకాలంగా విభేదాలు వున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. తీవ్ర కోపోద్రేకుడైన హరి తన వద్ద తెచ్చుకున్న కత్తితో అశోక్‌కుమార్‌పై దాడి చేసి కడుపులో కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన బాధితుడి కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుని తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్

స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు!

- అందని ద్రాక్షలా రోగ నిర్ధారణ
- ఆస్పత్రిలో చేరితేనే స్కానింగ్ రాస్తారట
- వెనుదిరుగుతున్న పేద రోగులు

7



డిజిటల్ అరెస్టు ముఠా ఆటకట్టు

- 12 మంది అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- రూ.12లక్షల నగదు, 17 సెల్‌ఫోన్లు, పాస్‌బుక్కులు, ఏటీయం కార్డులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



నిందితుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు అంటూ బెదిరించి డబ్బులు లాగేస్తున్న 12 మంది అంతర్రాష్ట్ర సైబర్ ముఠా సభ్యులను పులివెందుల పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, వేంపల్లె సీఐ నరసింహులు, సైబర్ క్రైం సీఐ మధుసూదనరెడ్డితో కలిసి ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

వేంపల్లెకు చెందిన రిటైర్డ్ ఎంఈవో వీరారెడ్డిని డిజిటల్ అరెస్టు పేరుతో వీడియోకాల్స్ చేసి ఢిల్లీలో కేసు నమోదుతో పాటు ఫేక్ సుప్రీంకోర్టు కాపీలు వాట్సప్ ద్వారా పంపించి బెదిరించారన్నారు. ఈ అరెస్టు తాత్కాలికంగా వాయిదా వేసేందుకు తమకు అమౌంటు చెల్లించాలని చెప్పడంతో వారి మాటలకు భయపడిన వీరారెడ్డి తన అకౌంటులోని డబ్బు పంపించాడన్నారు. అలా దాదాపు ఏడు నెలల నుంచి వీరారెడ్డిని బెదిరిస్తూ లక్షల్లో డబ్బులు వసూలు చేశారన్నారు. చివరికి వీరారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు డీఎస్పీ సైబర్ సెల్ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ఈ కేసును ఛేదించామని అన్నారు. వీరు వీరారెడ్డి వద్ద డబ్బులు వసూలు చేసేందుకు వేంపల్లెకు వచ్చినట్లు సమాచారం రావడంతో 12 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పులివెందుల డీఎస్పీ ఆధ్వర్యంలో అరెస్టు చేశామన్నారు.. అరెస్టు అయిన వారి వద్ద నుంచి రూ.12.58లక్షల నగదు, 17 సెల్‌ఫోన్లు, 13 బ్యాంకు పాస్ బుక్కులు, 52 ఏటీఎం కార్డులు, ఆరు చెక్‌బుక్‌లు, 16 సిమ్‌కార్డులు, 6 ఆధార్‌కార్డులు సీజ్ చేసినట్లు తెలిపారు.

డిజిటల్ అరెస్టు అంటే భయపడవద్దు

ఎవరైనా కొత్త వ్యక్తులు వాట్సాప్ కాల్ కానీ, ఇన్‌స్టాగ్రామ్ వీడియోకాల్స్ చేసి మీ ఆధార్‌కార్డు ద్వారా సిమ్‌కార్డు తీసుకుని నేరాలకు పాల్పడ్డారంటూ మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామంటే ఎవరూ భయపడవద్దని ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు కానీ ఎన్ఐఏ, సీబీఐ అధికారులు ఎవరూ వీడియోకాల్ చేయరని, ఏదైనా నేరాల్లో ఉంటే నేరుగా పోలీసులే ఇంటి వద్దకు వస్తారని అన్నారు. ఇలాంటి వీడి యోకాల్స్‌కు ఎవరు కూడా భయపడవద్దని, వారి మాటలకు స్పందించవద్దని సూచించారు. ఇలాంటి కాల్స్ వస్తే తక్షణమే సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిందితుల వివరాలు, నేపథ్యం

- కర్ణాటక రాష్ట్రం శివమొగ్గలోని ఓసా నగర్‌కు చెందిన నరసింహ అలియాస్ నవీన్ బీటీయం వరకు చదువుకున్నాడు. టెలిగ్రాం గ్రూపు ద్వారా అకౌంటు వివరాలు సేకరించి ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు చెందిన యువకులకు డబ్బులు ఆశ చూపించి వారి వద్ద నుంచి కొత్త బ్యాంకు అకౌంటులు చేయిస్తాడు. దీని ద్వారా డిజిటల్ అరెస్టు పేరుతో ఢిల్లీ, ముంబై ప్రాంతాల నుంచి రిటైర్డ్ ఉద్యోగులను బెదిరించి ఆ అకౌంట్లకు డబ్బులు వేయించుకుంటాడు. సదరు అమౌంటు ఫ్రాపే కంపెనీ, ప్రిఫ్టో కరెన్సీ లేదంటే క్యాష్ రూపంలో వసూళ్లు చేసుకుంటారు.
- రాజస్థాన్ రాష్ట్రం బాల్సువాడలోని పలోడా బ్లాక్‌గాటికి చెందిన పీయూష్ కేలీ హోటల్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. ఇతను డిగ్రీ వరకు చదువుకుని గతంలో దుబాయ్‌లో పనిచేస్తూ తిరిగి సొంత ఊరు వచ్చి గ్రోపే కంపెనీ తరపున ఉంటూ సైబర్ క్రైం అకౌంట్లు ఉన్న వారికి లాడ్జిలు తీసుకుంటూ వారి అకౌంట్ల ద్వారా డబ్బులు డ్రా చేసుకుంటాడు. సైబర్ నేరగాళ్లతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడు.
- ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం గుడిపూరిపాలెంకు చెందిన రవిచంద్ర అలియాస్ రవీంద్ర బీటెక్ సెకండియర్‌లో డ్రాప్ అయ్యాడు. ప్రకాశం జిల్లా వాగుల ఉప్పలపాడులోని మాధవరం గ్రామానికి చెందిన ప్రశాంత్ డిగ్రీ చదువుకుంటున్నాడు. వీరు టెలిగ్రాం ద్వారా ముంబైలో ఉన్న నవీన్‌కు పరిచయం అయ్యారు. వీరిద్దరూ బంధువులు, స్నేహితులకు ఎక్కువ డబ్బులు ఇస్తారంటూ ఆశ చూపించి బ్యాంకు అకౌంట్లతో పాటు ఏటీయం కార్డులు చేయించి వాటిని ముంబైలో ఇస్తుంటారు. అలాగే ప్రకాశం జిల్లా నాగుల ఉప్పలపాడుకు చెందిన అన్నపురెడ్డి పోతురాజు, పొదిలి మండలం రెడ్డిపాలెంకు చెందిన చెన్నపురెడ్డి పెద్దబ్రహ్మారెడ్డి, గుంటూరు టౌన్ కోటరిపాడుకు చెందిన కుడుమల వెంకటరెడ్డి, విజయవాడలోని భవాని పురానికి చెందిన చిన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, కర్నూలు జిల్లా సి.బెళగల్‌కు చెందిన ఉప్పరి నాగేంద్ర సైతం నిందితులు. కడప జిల్లా రంగసముద్రంలోని గిరినగర్‌కు చెందిన తిరువీధి విష్ణువర్ధన్, కొండాపురం మండలం ఎస్.తిమ్మాపురానికి చెందిన ఒంటెద్దు సాయి లిఖిత్‌కుమార్‌రెడ్డి పులివెందులలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఫోర్త్ ఇయర్ చదువుకుంటున్నారు. డబ్బులకు ఆశ పడి వీరు సైబర్ నేరస్తులతో చేతులు కలిపి తమకు తెలిసిన వారితో అకౌంట్లు చేయిస్తూ వాటిని కొరియర్ ద్వారా నవీన్‌కు చేరవేస్తుంటారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని కుమ్మరిగూడెంకు చెందిన పాలబిందెల అఖిల్ ఇంజనీరింగ్ చదువుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. వీరంతా తమకు తెలిసిన వారి అకౌంట్లు పంపించి వాటికి వచ్చే డబ్బుల నుంచి కమీషన్ తీసుకునేవారు.

రూ.30 లక్షల ప్రమాద బీమా

● చెక్కును అందజేసిన ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి



చెక్కును అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఆగస్టు 18న ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు బి.ఈశ్వర్ నాయక్ కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అందించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో చెక్కు రూపంలో హోంగార్డు సతీమణి బి.లక్ష్మీ భాయికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హోంగార్డు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు, కౌంటర్ హెడ్ ప్రదీప్, మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ రవూఫ్, గర్నమెంట్ ఆర్ఎం రాజేశ్, శాలరీ అకౌంట్ మేనేజర్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ గ్రామాలు అభివృద్ధి సాధించాలి



ఐపీఎస్ తరుణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, అన్నిశాఖల అధికారులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లోని గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి తరుణ్‌యాదవ్, ఐఎఫ్ఎస్ హర్షవర్ధన్ తెలిపారు. మూడు రోజులుగా మండలంలోని బి.యర్రగుడి, కోనంపేట, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రజల జీవన విధానం, జీవనోపాధి కల్పన గ్రామాల అభివృద్ధి, పంచాయతీల విధి విధానాలు, భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై మూడు రోజులపాటు ప్రజలతో చర్చించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీడీవో రెడ్డెయ్య, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో చాలా గ్రామాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు. సన్మానం అందుకున్న వారిలో ఐఆర్ఎస్‌లు తన్మైజాహన్, సౌరభ్‌కుమార్, ఐఆర్ఎస్‌డీ వినీత్‌జాదవ్, ఐఆర్ఎంఎస్ ఆనంద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్డీ ఉషారాణి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఒక వాహనం స్వాధీనం, ఇద్దరు పరార్



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, ఇన్నోవాతో ఫారెస్ట్ అధికారులు

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ వైసీ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సానిపాయి రేంజ్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం వీరబల్లి మండలం తాటిగుంటపల్లి దగ్గర నిఘా ఏర్పాటు చేసిన అటవీ శాఖ సిబ్బందికి ఒక వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా, అది ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో వారు ఆ వాహనాన్ని వెంబడించి సుండుపల్లె మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె దగ్గర అడ్డుకోగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 626 కేజీల 20 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి వాటి విలువ రూ.10 లక్షలుగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడంతో పాటు, పారిపోయిన వారికోసం గాలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రజిని, ఎఫ్‌బీవో లీల, శ్రీహరి, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

● బేస్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లలో స్థానం



బాలికలతో ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బేస్‌బాల్ జిల్లా జట్టులో నాగచైతన్య అండర్-17 విభాగంలో సంధ్య హ్యాండ్‌బాల్ అండర్-14లో ఆసీఫా, చంద్రప్రియ, దీపిక ప్రధాన జట్టుకు ఎంపిక కాగా స్టాండ్‌బైగా జైబా, అండర్-17 జట్టుకు అహనా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షకీరాబేగం, ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి శుక్రవారం తెలిపారు. బేస్‌బాల్ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి నంద్యాలలో, అండర్-14 బేస్ బాల్‌పోటీలు 29 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరులో, అండర్-14 హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు కలికిరిలో జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.

స్టేట్ లెవెల్ క్రికెట్ పోటీలకు ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు

గాలివీడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్న మెంట్‌లో భాగంగా ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో క్రికెట్ విభాగంలో గాలి వీడు ఉపాధ్యాయులు ప్రతిభ చూపారు. మండల ఎస్టీయూ సభ్యులు దేరంగుల రామేశ్వర్, మడితం రమణయ్య, పి.సురేశ్‌కుమార్ ఎంపికైనట్లు ఎంఈవోలు పి.నాగరాజు, వి.శ్రీనివాసులు తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న స్టేట్ లెవెల్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఎంఈవోలు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై బ్లూ కలర్ ప్యాంటు, గోధుమ రంగు గళ్ల షర్టు ఉంది. రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యమే మృతికి కారణమై ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇతర వివరాలు తెలియరాలేదని పోలీసులు వివరించారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రారంభించి... మోకాలొడ్డి

● అర్ధాంతరంగా ఆగిన రహదారి పనులు

● ఐదేళ్లుగా పూర్తికాని పనులు

● నిత్యం ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు

● కూటమి పాలనలోనూ పడని ముందడుగు



ప్రమాదకరంగా కూలేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-సుండుపల్లె ప్రధాన రహదారి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. రహదారుల అభివృద్ధికి గత ప్రభుత్వం మోకాలడ్డుతూ వచ్చింది. అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి అరకొరగా నిధులిచ్చి చేతులు దులుపుకొంది. రూ.కోట్ల విలువైన పనులను నిలిపేయడంతో రహదారులపై వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆటోలు, బస్సులు, కార్లు, లారీలు, టిప్పర్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల వలన పదుల సంఖ్యలో ప్రాణాలు పోగా, అనేక మంది క్షతగాత్రులై అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేయడం వలన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. కారులో, బస్సుల్లో వెళ్లాలన్నా, రావాలన్నా గుంతలతో హైరానా తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ముందడుగు పడలేదు. కూటమి నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రయాణికులు పలుమార్లు జిల్లా అధికారులకు, రవాణా శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.



ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం

సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి

- రామాశ్రీనివాస్, జనసేన నాయకుడు



సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి రహదారి దుస్థితి, ఝరికోన కాలువల విషయం తీసుకెళ్లాను. అంతేగాకుండా రహదారి, భవనాల శాఖ మంత్రి, జిల్లా సర్వోన్నత అధికారికి పలుమార్లు వినతిపత్రం అందజేశాను. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని చెబుతున్నారు.

గతంలో అటవీ అనుమతుల సాకు

వైసీపీ పాలనలో డబుల్ రోడ్డు పనులను ప్రారం భించారు. అయితే సకాలంలో నిధులు కాంట్రా క్టర్లకు అందించకపోవడం వలన పనుల్లో జాప్యం జరిగింది. పైగా రాయచోటి నుంచి సుండుపల్లెకు వచ్చే మార్గమధ్యంలో అటవీ ప్రాంతం ఉండడం వలన అటవీశాఖ అనుమతుల పేరిట దాదాపు ఏడాదికి పైగా ప్రజలను మభ్యపెట్టారు. అయినా గత ప్రభుత్వంలో అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రధానంగా సుండుపల్లె, రాచంవాండ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి అనుంపల్లి అటవీ ప్రాంతంలో రహదారి ఇరువైపులా మట్టి కోతతో ప్రధాన రహదారి నుంచి ఎదురుగా వాహనం వచ్చే సమయంలో పక్కకు దిగి ఎక్కాలంటే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సుండుపల్లె-దిగువ గుల్లావాండ్లపల్లె నుంచి సుండుపల్లె విద్యుత్ ఉపకేంద్రం వరకు కూడా సిమెంటు రహదారి పనులు జరగాల్సి ఉంది.

ఐదేళ్లుగా సాగుతున్న పనులు

రాయచోటి-సుండుపల్లె మార్గంలో 20 కి.మీ. మేర రహదారిని విస్తరించేందుకు ఎన్‌డీబీ కింద రూ.61.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రాయచోటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి శిబ్యాల, అనుంపల్లి మధ్య రహదారిని మొదలు పెట్టి వదిలేశారు. ఈ మార్గంలోని శిబ్యాల వంకపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు పక్కనే నూతన వంతెన నిర్మాణానికి కడ్డీలు అమర్చి స్లాబ్ వేయకపోవడంతో అవి తుప్పు పట్టాయి. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా, కేవీపల్లి, చీనేపల్లి, పీలేరు, రాజంపేటలకు బస్సులు వెళుతున్నాయి. అతుకుల రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాయచోటి- రాజంపేట రహదారిని 16 కి.మీ. మేర విస్తరించాల్సి ఉండగా పనులు ఉన్నపళంగా నిలిపేశారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి

- విశ్వనాథరెడ్డి, రాయచోటి లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యుడు



రాయచోటి- సుండుపల్లె రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా సంవత్సరాల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు సరికాదు. అదే సమయంలో ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు నిధులు కేటాయించాలి.



అటవీప్రాంతంలో ప్రమాదాలకు నిలయమైన తారు రోడ్డు

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ నాగయ్య



వికలత్వ నిర్ధారణ శిబిరానికి హాజరైన వారు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని డిప్యూటీ డీఈవో డాక్టర్ ఎల్.నాగయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల కోసం సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్ ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో కంటే నేడు ప్రభుత్వం రవాణా, ఎస్కార్ట్, స్టైపండు, ఇంటి వద్ద విద్యకు రెట్టింపు అలవెన్సులు ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు పాఠశాలలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు చూడాలని కోరారు. నిర్ధారణ పరీక్షలకు హాజరైన విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ స్కూటర్, ట్రైసైకిల్, వీల్ చైర్స్, రోలేటర్స్, చంక కర్రలు, వినికిడి యంత్రాలను నెలరోజుల్లోగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామయ్య, జీసీడీవో సుమతి, ఏఎస్‌వో అసదుల్లా, ఎంఈవోలు ఆంజనేయనాయుడు, జయచంద్ర, అలీమ్, వైద్యులు శివానిస్, శివప్రకాశ్, ఆడియాలజిస్టు మమత, సమ్మిళిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు

● హాజరు కానున్న 13 జిల్లాల క్రీడాకారులు



మైదానంలో బేస్‌బాల్‌ను ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూలు మైదానంలో శనివారం నుంచి సోమవారం వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎస్‌వీ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోధర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అనువుగా మైదానం తయారు చేశామని తెలిపారు. ఈ పోటీల్లోనే ప్రతిభ కల్గిన క్రీడాకారులను ఎంపిక చేసి జనవరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్లను పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు వచ్చి ఉన్నారని తెలిపారు.

లింగ వివక్షపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న లింగ వివక్షకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వర రావు అన్నారు. పీలేరు సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన జెండర్ కమిటీల ఏర్పాటు, లింగ వివక్షపై పోరాటంపై నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ అమ్మ కడుపులో నుంచి మరణించే వరకు సమాజంలో మహిళలు అనేక విధాలుగా వివక్షకు గురవుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున ఈ సమస్యను రూపుమాపడానికి క్షేత్రస్థాయిలో చర్చలు, సమావేశాలు, శిక్షణ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. లింగ వివక్షపై పోరాడేందుకు గ్రూపు, గ్రామ, మండల స్థాయిల్లో ఒక సోషియల్ యాక్షన్ టీంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ టీంల ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చే వివక్ష ఉదంతాలను ఆ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే జిల్లాలో రాయచోటి, పీలేరు, మదనపల్లెల్లో మూడు జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సెర్ప్ రూపొందించిన కరపత్రాలను ఏపీఎంలు, సీసీలకు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం ధర్మరాజు, రిసోర్స్ పర్సన్ కిజర్ హయాత్ ఖాన్, ఏసీ జవహర్, ఏపీఎంలు అనూరాధ, నర్సోత్తమ రెడ్డి, దేవసేన, పురుషోత్తం రెడ్డి, రజనీ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సక్రమ జీవనశైలితోనే మధుమేహం నియంత్రణ

● జిల్లా అదనపు వైద్యాధికారి రాధిక

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరైన జీవనశైలిని అనుసరించడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక, పారా మెడికల్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిరక్షణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో 165 దేశాల్లో ప్రజలు ఈ వ్యాధికి గురయ్యారన్నారు. మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి అని, అశ్రద్ధ చేస్తే గుండెపై ప్రభావం, కంటి చూపు మందగించడం, శరీరంపై గాయాలు మానకపోవడం, నరాల బలహీనత, పక్షవాతం లాంటివి సంభవిస్తాయన్నారు. ఒకసారి మధుమేహం బారిన పడితే దానిని నిర్మూలించడం సాధ్యం కాదన్నారు. తీవ్రమైన అలసట ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని, సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డెమో దేవశిరోమణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు





వీరభద్రాలయంలో లక్ష గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు, పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కార్తీకమాస శుక్రవారం సందర్భంగా భద్రకాళీ అమ్మవారు లక్ష గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు రాహుకాల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి పాల్గొన్నారు.

త్వరలో డిజిటల్ పేమెంట్స్

● సహకారశాఖకు రిజర్వ్ బ్యాంకు అనుమతి

● టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్



సహకార వారోత్సవాల్లో మాట్లాడుతున్న విద్యాసాగర్

మదనపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా డిజిటల్ పేమెంట్‌కు రంగం సిద్ధం చేశామని టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ అన్నారు. స్థానిక కో-ఆపరేటివ్ పట్టణ బ్యాంకులో శుక్రవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెలాఖరులో టౌన్‌బ్యాంకు శత వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార సంస్థల్లో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పారదర్శకత అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా బ్యాంకులో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఫోన్-పే, గూగుల్ పే, పేటీఎం అమలుకు, మొబైల్ బ్యాంకింగ్ సదుపాయాల కల్పనకు రిజర్వు బ్యాంకు అనుమతి ఇచ్చిందని, నెలాఖరులో ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి రోషన్ జమీర్ మాట్లాడుతూ టౌన్‌బ్యాంకు వందేళ్లు పూర్తి చేసుకోవడం శుభపరి ణామన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ పి.వి.ప్రసాద్, బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్ కుమార్, డైరెక్టర్లు రవీంద్ర నాథ్, రవికాంత్, ముక్తియార్‌ఖాన్, సోమశేఖర్, నాదెళ్ల శివ, ఆకుల కృష్ణమూర్తి, సర్దార్‌ఖాన్, జె.దేవేంద్ర, భాస్కర్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి



మృతిచెందిన వెంకటసాయి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ టిల్లర్ కిందపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన సంబేపల్లె మండలం శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గాండ్లపల్లికు చెందిన భారతి భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటోంది.. ఆమె పెద్ద కుమారుడు షణ్ముఖ వెంకటసాయి (12) శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఎక్కి స్టార్ట్ చేశాడు. దీంతో భయపడి వెనుకకు పడిపోవడంతో మృతి చెందాడు. ఆ బాలుడు అడవికమ్మపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు.

దత్తత.. సామాజిక బాధ్యత

- స్త్రీశిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దత్తత ప్రేమతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి తెలిపారు. శుక్రవారం దేవపట్ల బాలయోగి గురుకుల విద్యాలయంలో బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మాస వారోత్సవాల సందర్భంగా దత్తత తీసుకోవడాన్ని బలోపేతం చేయడం, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కుటుంబం ఆధారిత సంరక్షణ అందిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో ఉదయశ్రీ, ఎంఈవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, గుడ్ నైబర్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, బాలయోగి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మధుమతి, ఏఎస్ఐ నాగమణి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి



స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు!



ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఆర్ఐ స్కానింగ్ విభాగం

- అందని ద్రాక్షలా రోగ నిర్ధారణ
- ఆస్పత్రిలో చేరితేనే స్కానింగ్ రాస్తారట
- వెనుతిరుగుతున్న పేద రోగులు
- జిల్లా ఆస్పత్రిలో బోసిపోతున్న సీటీ, ఎంఆర్ఐ విభాగాలు

అక్కడ చికిత్స మాట దేవుడెరుగు. అసలు రోగమేంటో తెలియాలంటే ఆంక్షల తీరం దాటాల్సిందే. కళ్లెదుట ఎంఆర్ఐ, సీటీస్కానింగ్ విభాగాలు కనపడుతున్నా వాటికి నిబంధనల సంకెళ్లు విధించారు. రెండు రోజులపాటు ఆస్పత్రిలో అడ్మిట్ అయితే తప్ప స్కానింగ్ రాయమంటున్నారు వైద్యులు. దీంతో ఏం చేయాలో అర్థం కాక.. ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లలో వేల రూపాయలు చెల్లించలేక జిల్లా ఆస్పత్రికి వచ్చిన నిరుపేదలు వ్యాధి నిర్ధారణ కాకుండానే వెనుతిరిగే పరిస్థితి నెలకొంది.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సుమారు ఎనిమిది మండలాల పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలు అందిస్తోంది. ఇక్కడ ప్రతి రోజు 900 నుంచి 1100 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడికి ప్రొద్దుటూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలు అయిన మైదుకూరు, చాపాడు, రాజుపాళెం, దువ్వూరు, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల, ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు వస్తుంటారు. జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే మొదలుకొని అన్ని రకాల స్కానింగ్‌లను ఉచితంగా చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు కొన్నేళ్ల కిందట ఏర్పాటయ్యాయి. ఏ రోజు కూడా సేవలు అందించడంలో ప్రజలకు ఇబ్బంది కలుగలేదు.

జాయింట్ కమిషనర్ ఆదేశాలతో

ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌కిశోర్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ప్రజలకు వైద్యం ఎలా అందుతుంది, రోజుకు ఎంత మంది చికిత్స చేయించుకుంటున్నారు. మందుల సరఫరా తదితర వాటిపై ఆయన ఆస్పత్రి అధికారులతో మాట్లాడలేదు. వైద్యులను పిలిపించి సీటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లను ఇష్టానుసారంగా రాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ విభాగాల్లో అధిక మొత్తాల్లో స్కానింగ్‌లు రాయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు రాయొద్దంటూ హుకుం జారీ చేశారు. అప్పటి నుంచి జిల్లా ఆస్పత్రిలో ఆంక్షల పర్వం మొదలైంది.



బోసిపోయిన సీటీస్కానింగ్ విభాగం

ఆస్పత్రిలో చేరితేనే స్కానింగ్

ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో సిటీస్కాన్ తీయించుకుంటే మూడు నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎంఆర్ఐ స్కానింగ్ అయితే రూ.4 వేల నుంచి రూ.14 వేల వరకు రోగులు చెల్లించాల్సి ఉంటుంది. వేలాది రూపాయలు చెల్లించే స్తోమత లేని నిరుపేదలు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయిస్తే ఆంక్షలు భయపెడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు మినహా ఓపీ ప్రాతిపదికపై ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లు వైద్యులు రాయడంలేదు. ఆస్పత్రిలోని ఆర్ఎంవో, సూపరింటెండెంట్‌లకు కూడా ఈ స్కానింగ్‌లు రాసే అధికారం లేదట. ఒకవేళ రాస్తే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని జంకుతున్నారు. కేవలం ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు మాత్రమే ఈ స్కానింగ్‌లను రాస్తున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ కోసం ఆస్పత్రికి పేద ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

బోసిపోయిన రెండు విభాగాలు

ఇది వరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లలో 12 మంది సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించేవారు. దీంతో రోజుకు 45 నుంచి 60 వరకు సీటీ స్కానింగ్‌లు చేసేవారు. ఎంఆర్ఐ స్కానింగ్‌లు నిత్యం పాతికపైనే నడిచేవి. ప్రస్తుతం కొనసాగుతున్న ఆంక్షలు కారణంగా ఎంఆర్ఐ స్కానింగ్ సంఖ్య పది దాటడంలేదు. సిటీస్కానింగ్‌లు సగానికి సగం తగ్గిపోయాయి. వారాంతపు చివరి రోజుల్లో ఈ విభాగాలు దాదాపు నిలిచిపోయి బోసిపోతున్నాయి. దీంతో ఈ తరహా ఆంక్షలు ఒక్క ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉన్నాయని, రాష్ట్రంలో మరెక్కడా లేవని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉన్నతాధికారులు పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిబంధనలు సులువుతరం చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం.

జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలు అమలు చేస్తున్నాం. ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు రోగిని పరీక్షించి స్కానింగ్ అవసరం అనిపిస్తే.. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర కేసుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. రోగులకు ఇబ్బందిగా మారినప్పటికీ నిబంధనలు అమలు చేయక తప్పదు.

-డాక్టర్ సుజాత, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

సబ్‌రిజిస్ట్రారు కార్యాలయాల్లో డీఐజీ తనిఖీలు



మైదుకూరులో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజి రామలక్ష్మి

మైదుకూరు/ ముద్దనూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు సబ్‌రిజిస్ట్రారు కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా రిజిస్ట్రేషన్, స్టాంపులు శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.రామలక్ష్మిపట్నాయక్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించారు. రికార్డుల భద్రత, కార్యాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా త్వరగా రిజిస్ట్రేషన్‌లు చేయాలని సూచించారు. అలాగే పాత మున్సిపల్ ఆఫీసులో సబ్ రిజిస్ట్రారు కార్యాలయం కోసం చేపడుతున్న పనులను సబ్‌రిజిస్ట్రారు డీఎం బాషాతో కలిసి పరిశీలించారు. రికార్డుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, ఆన్‌లైన్ సమస్యలు తలెత్తకుండా అన్నీ సమకూర్చిన తర్వాత కార్యాలయం మార్చాలని తెలిపారు.

ముద్దనూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం రామలక్ష్మి పట్నాయక్ ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో రెవెన్యూ 70శాతం ఆర్థికవృద్ధి ఉందన్నారు. ఇక్కడి ప్రజలు చాలా వరకు ఇతర ప్రాంతాలలో రెవెన్యూ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుంటున్నందన ఆర్థికవృద్ధి తగ్గుతోందన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ వెంకటరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజ మహోత్సవాలు

- 30న లక్షార్చన, డిసెంబరు 12న గ్రామోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మండల పూజ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఉత్సవాల ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 16 నుంచి డిసెంబరు 26 వరకు మండల పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఉదయం 4.30 గంటలకు గణపతి హోమం, అభిషేకం, సర్వదర్శనం, రథోత్సవం, నవకలశ స్థాపన, ధర్మశాస్త్ర హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అయ్యప్ప మాలదారులకు బిక్ష, సాయంత్రం 5 గంటలకు మహాపడి పూజ, రథోత్సవం, హరివరహాసనం, రాత్రి 8.30 గంటలకు బిక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 30వ తేదీ లక్షార్చన, మధ్యాహ్నం 40 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం చేస్తామన్నారు. డిసెంబరు 12వ తేదీ స్వామి వారి గ్రామోత్సవం పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి అయ్యప్పసేవా సంఘం కార్యదర్శి సతీష్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు నాగేంద్రశర్మ, వల్లంకొండు మనోహర్, ఆరవేటి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన వికాసానికి వేదికలు గ్రంథాలయాలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న పద్మజ

కడప కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు కేవలం పుస్తకాలను భద్రపరిచే భాండాగారాలు కావని అవి విజ్ఞాన వికాసానికి ప్రధాన వేదికలని జిల్లా సమాచారశాఖ అధికారిని బి.పద్మజ అభివర్ణించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురష్కరించుకుని శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతి థిగా ఆమె హాజరై మాట్లాడారు. తొలుత గ్రంథాలయసంస్థ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. తదుపరి భారత తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పద్మజ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అందు బాటులో వున్నప్పటికీ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే శక్తి ఒక్క పుస్తక పఠనానికి మాత్రమే ఉందన్నారు. సెల్‌ఫోన్లు, టీవీల్లో ఎన్నో రకాల వైవిధ్యభరితమైన సమాచారం అందుబాటులోకి వస్తున్నా గ్రంథాలయాలు, పుస్తక పఠనం ద్వారా లభించే విజ్ఞానం ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. ప్రతి విద్యార్థి విధిగా కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని సూచించారు. మాతృభాష తెలుగును ప్రేమించాలని పిల్లలకు ఉద్బోధించారు. మాతృభాషపై పట్టు సాధి స్తే ఇతర భాషలు సులభంగా అర్థమౌతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి పవన్‌కుమార్, ఎంఈఓ రఫీఖ్ అహ్మద్, గ్రంథాలయ అధికారులు రాజకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

పులివెందుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురానికి చెందిన గోర్ల వంశీకృష్ణ యాదవ్ (30) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... శుక్రవారం రాత్రి 8గంటల ప్రాంతంలో వంశీకృష్ణయాదవ్ గొర్రెల వద్ద మొబైల్‌ఫోన్ చూస్తూ కూర్చొని ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు వెనుకవైపు నుంచి వచ్చి కత్తితో దాడి చేశారు. తలపై బలమైన కత్తివేటు పడడంతో వంశీకృష్ణ గట్టిగా కేకలు వేస్తూ అక్కడే పడిపోయాడు. చుట్టుపక్కల బంధువులు హుటాహుటిన పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారులు?

కడప క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కడపకు చెందిన కొంత మంది యువత ఇతర జిల్లాల నుంచి గంజాయి తెచ్చుకుని వాటిని ప్యాకెట్లుగా మార్చి ఇతరులకు ఎక్కువ రేటుకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. కడప రిమ్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి దాదాపు 20 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. నేడో రేపో వారిని అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

యువతి అదృశ్యం



మైలవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడియం గ్రామంలో కె.మౌనిక (16) అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్యాంసుందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం మూలపల్లికి చెందిన మౌనిక అనే యువతి దొడియం గ్రామంలో పిన్నమ్మ ఉండడంతో వారి ఇంటికి వచ్చి ఇక్కడే ఉండేది. ఈ క్రమంలో బయటికి వెళ్లి వస్తానని చెప్పి రాకపోవడంతో మౌనిక పిన్ని రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లాస్థాయి హాకీ ఎంపికలకు అనూహ్యస్పందన



ఎంపికైన బాలురు, బాలికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిమ్స్ సమీప వైయస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి హాకీ బాల, బాలికలు ఎంపికలకు అనూహ్యస్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ఔత్సాహిక బాల, బాలికలు దాదాపు 80 మంది హాజరయ్యారు. స్పోర్ట్స్ స్కూల్ హాకీ కోచ్‌లు అనిల్, ఖాదర్‌బాష ఆద్వర్యంలో ఎంపికలు జరిగాయి. పర్యవేక్షకులుగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ పీడీ మురళీకృష్ణారెడ్డి, రామనపల్లి జెడ్‌పీహెచ్ఎస్ పీడీ పోలంకి గణేష్ బాబు హాజరయ్యారు. హాజరైన బాల, బాలికలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇందులో బాలికల విభాగంలో టి.కావ్య, డి.హన్సిక, సి.బాస్మిన్, పి.హర్షిత, సి.శరణ్య, బి.మహాలక్ష్మి, పి.సునయన, ఎం.నాగనందిని, పి.గంగాకావ్య, ఎస్.ప్రశాంతి, ఎం.అమృతాదేవి, వి.మనీషా, కె.స్నేహిత, ఎన్.హరిత, బి.రాణి, పి.ప్రణతి, వై.సంజన, బి.అమృతతో పాటు స్టాండ్‌బైగా ఎల్.లక్ష్మీ, కె.హరిప్రియ, ఏ.ప్రణవి, టి. శివజ్యోతి ఎంపికయ్యారు.

బాలుర విభాగంలో సి.శరణ్‌కుమార్‌రెడ్డి, సీహెచ్ అమర్‌నాథ్, డి.సుశాంత్, కె.గీతేశ్వర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.ఇస్మాయిల్, వెంకటలిఖిత్, జె.అభినవ్, ఎ.మనోజ్‌కుమార్, ఎన్.వెంకటజగత్, ఎస్.ఇర్ఫాన్‌బాష, ఎ.రాజు, ఎంవీ విష్ణువర్ధన్, వి.సాయిమోహన్, జి.అనూప్‌కుమార్, జె.మహేష్‌బాబు, ఎ.రిషిత్‌వర్మ, జి.మంజునాథ్‌తో పాటు స్టాండ్‌బైగా ఎస్.సోహైల్, ఎ.చరణ్, ఓ.హరిప్రసాద్ ఎంపికైన వారిలో ఉన్నారు.

పరిశోధనల్లో జాతీయ సంస్థలతో పోటీపడాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయ స్కాలర్లు పరిశోధనల్లో కేంద్ర విద్యా సంస్థలతో పోటీపడాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వైవీయూలో పరిశోధక విద్యార్థుల కోసం రెండు రోజుల రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి స్కాలర్ నాణ్యమైన పరిశోధనలు చేసి పరిశోధనపత్రాలను రూపొందించాలన్నారు. వాటిని ప్రతిష్ఠాత్మక జర్నల్స్ అని స్కోపస్, స్ప్రింగర్స్, ఎమరాల్డ్‌లో ప్రచురితం చేయించుకోవాలన్నారు. ఇతర విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల పరస్పర సహకారంతో జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో భాగస్వామ్యం వహించాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాస్‌కుమార్ రీసెర్చ్ డిజైన్ గురించి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఐరాల లోకనాథన్‌రెడ్డి రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌పై అవగాహన కల్పించారు. వైవీయు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య చంద్ర ఓబబులరెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించారు. ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, పీఎం ఉష సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ అధ్యాపకులు, స్కాలర్లు పాల్గొన్నారు.

సాంకేతికతతో వేగవంతమైన నిర్ణయాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతికతను ఉపయోగించి వ్యాపార రంగంలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవచ్చని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ వి.శ్రీనివాసకుమార్ అన్నారు. శుక్రవారం వైవీయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖలో బిజినెస్ అనలిటిక్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బిగ్ డేటా, డేటా మైనింగ్, రిపోర్టు, పబ్లిషింగ్ వంటి విషయాలపై విశ్లేషించారు. కస్టమర్లను అర్థం చేసుకోవడం, వ్యాపార నివేదికలను రూపొందించడం గురించి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంబీఏ శాఖాధిపతి డాక్టర్ పి.సరితసమన్వయం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రమాదకరంగా సీపీఎస్



ధర్నాలో మాట్లాడుతున్న ఎస్టీయూ నేత రమణారెడ్డి

కలసపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారిన టెట్, సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వ ర్యంలో శుక్రవారం న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగిం చారు. ఉపాధ్యాయులందరు తప్పనిసరిగా టెట్ పాస్ కావా లన్న సుప్రీంకోర్టు ఉత్తర్వుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూడడం తగదన్నారు. ప్రభుత్వాలు స్పందించి విద్యాహక్కు చట్టంలో సవరణలు చేసి 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులందరికీ టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అలాగే ఉపాధ్యాయ కుటుం బాలను రోడ్డుపాలు చేసే సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యా యుల డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఏఐఎఫ్ఈటీఓ అనుబంధ సంఘాలతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలు చేపడతామన్నారు.

డ్రాగా ముగిసిన అండర్-14 బాలుర క్రికెట్ మ్యాచ్‌లు



మణిదీప్ (చిత్తూరు), చరణ్‌తేజ (కర్నూలు)

కడప స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 బాలుర మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఓఆర్ఎం క్రికెట్ స్టేడియంలో కడప-చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.2 ఓవర్లలో 289 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 11 పరుగులే చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండోరోజు శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి మొత్తం 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 347 పరుగులు చేసింది. ఇందులో మణిదీప్ 127, రక్షణ సాయి 92 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలువడంతో భారీ స్కోర్ సాధించింది. దీంతో చిత్తూరు జట్టు 58 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యతతో 3 పాయింట్లు సాధించింది. కడప జట్టుకు 1 పాయింట్ లభించింది.

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నెల్లూరు-కర్నూలు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 70.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 351 పరుగుల స్కోర్ వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. అనంతరం కర్నూలు జట్టు మొదటి రోజు 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు చేపట్టి 84.4 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 239 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో చరణ్‌తేజ 108, రిషి 71 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 88 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించగా, నెల్లూరు జట్టుకు 3, కర్నూలు జట్టుకు 1 పాయింట్ దక్కింది.

మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత పాటించాలి

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని రైల్వేకోడూరు జడ్పీటీసీ సభ్యురాలు పాళెంకోట రత్నమ్మ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 2వవార్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యా హ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు రుచిగా భోజనం తయారు చేయాలన్నారు. నాణ్యతలో రాజీ పడరాదని తెలిపారు.

శివాలయంలో అన్న సంతర్పణ

సుండుపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలోని శివాలయ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం సుండుపల్లె మండల డిప్యూటీ తహసీల్దార్ వినూత్‌కుమార్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి రవిశంకర్ అన్న సంతర్పణ చేశారు. విరూపాక్ష స్వామికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ : చమర్తి

రాజంపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు ప్రధానంగా



వినతిపత్రాలు స్వీకరిస్తున్న జగన్‌మోహన్‌రాజు

పెన్షన్‌లు, ఇళ్ల పట్టాలు, భూ ఆక్రమణలు, భూముల ఆన్‌లైన్ సమస్యలపై ఎక్కువగా వినతిపత్రాలు వస్తున్నాయన్నారు ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, రూరల్ అధ్యక్షుడు మేడికొండు రవి కుమార్‌నాయుడు,జీవీ సుబ్బ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

సిద్దవటం: మండలంలోని మాధవరం-1 పంచాయతి ఎస్‌కేఆర్‌నగర్ గ్రామ శివారులో ఉన్న సర్వేనంబరు 1069/2లో 30 ఏళ్లుగా గ్రామ దేవతకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాధవరం-1 గ్రామ ప్రజలు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ స్థలంపై కన్నేసిన కొందరు కబ్జా చేసేందుకు యత్నించారన్నారు. వారిని అడ్డుకుని స్థలాన్ని కాపాడుకుందామన్నారు. ఇలాంటి కబ్జా లు పునరావృతం కాకుండా తమ స్థలాలను గ్రామదేవతలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు.

లింకు రోడ్లను ఏర్పాటు చేయండి



ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని మాధవరం గ్రామ పరిధి లోని మూల గంగమ్మ గుడి నుంచి మాలపల్లి వరకు, గురికాని వాండ్లపల్లె నుంచి మద్దె ల వాండ్లపల్లె, పేయలవాండ్ల ఎల్లె, కాటినేనివారిపల్లె, వెంకటాపురం మీదుగా గాలివీడు రోడ్డు వరకు లింకు రోడ్లను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం రాయచోటి మండల టీడీపీ క్లస్టర్ కోకన్వీనర్ కాశినేని మహేందర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించారు. మాధవరం గ్రామాన్ని ఇతర ప్రాంతాలకు కలుపుతూ అవసరమైన రెండు లింకు రోడ్లు పూర్తైతే మాధవరం, గాలివీడు మధ్య వ్యాపార లావాదేవీలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయ న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు కసినేని వీరమల్లునాయుడు, మనోహర్‌నాయుడు, రామలింగారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. లింకు రోడ్లను ఏర్పాటు చేయండి

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు

పుల్లంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కడపలోని వైఎస్‌ఆర్ స్పోర్ట్స్ స్కూల్లో శుక్రవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలురు, బాలికలు జిల్లా స్థాయి హాకీ సెలక్షన్స్‌లో పుల్లంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు సి.హర్షిత, సి.జాస్మిన్, రిషిత్‌వర్మ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యార ఈనెల 22 నుంచి 24 వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, ఫిజికల్ డైరెక్టర్ నీలకంఠరావు తెలిపారు.

ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు

సిద్దవటం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా సిద్దవటం కోఆపరేటివ్ బ్యాంకులో శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో సుకుమార్ మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 20 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని సహకార సంఘాల నిర్వహణ సామర్థ్యం జవాబుదారీతనం, పారదర్శకత అంశాలను రైతులకు తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు శైలజ, నవీన్, సొసైటీ పర్సనల్ అధికారి శ్రీధర్, నిత్యపూజకోన చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు ముస్లింల అన్నదానం

గాలివీడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టమీద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్ప మాల దారులకు ముస్లింలు భిక్ష ఏర్పాటు చేశారు. మిట్టపల్లి గోపీకృష్ణారెడ్డి, అమీన్ (మెడికల్ స్టోర్) వారి సౌజన్యంతో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అయ్యప్ప భక్తులకు భిక్షను అందజేస్తున్న ముస్లింలు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఏటా కార్తీక మాసంలో అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎంతో కఠోరమైన అయ్యప్ప దీక్ష చేస్తున్న భక్తులకు సేవ చేయడం సంతృప్తినిచ్చిందని ముఖ్య అతిథి నిజాముద్దీన్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సమీర్, వినోద్, నాయుడు, అంజాద్ బాషా, హలీమ్, యూనస్, జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు

గాలివీడు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ మాజీద్‌అహ్మద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు ఆయన పలు సూచనలిచ్చారు. లైసెన్సులు తప్పనిసరిగా షాపుల్లో ప్రదర్శించాలని, గుర్తింపు పొందిన కంపెనీల ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆదేశించారు. బిల్లులు, ఇన్‌వాయిస్‌లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. అధిక యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని, నానో యూరియా ప్రయోజనాలను వివరించాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి గౌతమి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

సిద్దవటం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉపాధ్యాయుడు పని వేళలు పాటించాలని, అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి నాగరత్న(ఎఫ్ఏసీ) హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని సాయినగర్‌లో శుక్రవారం సాయినగర్ ఓరియెంట్ ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలిచంఆరు. ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి 'మానవత' చేయూత

చిట్వేలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కె.కందుల వారిపల్లె పంచాయతీ బాలాజినగర్‌కు చెందిన వసంతమ్మకు మానవత చిట్వేలి శాఖ సభ్యులు శుక్రవారం దాతల నుంచి సేకరించిన రూ.10 వేలతోపాటు, మానవతా చిట్వేలిశాఖ సభ్యులు రూ.10 వేలు, మొత్తం 20 వేల రూపాయలను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దోమలను నియంత్రిస్తే రోగాలు దూరం అవుతాయని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరామయ్య తెలిపారు. శుక్రవారం కుర్నూతల గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్త దిబ్బలు ఊరికి దూరంగా వేసుకోవాలని అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈవో దేవదానం, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

చిన్నమండెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం ధ్వజస్థంభ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

డైట్‌లో ఘనంగా బాలల దినోత్సవం

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని డైట్ కేంద్రంలో డీఈవో కె.సుబ్రమణ్యం, అధ్యాపక బృందం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ బాలల హక్కులు, విద్య, పిల్లల సంక్షేమంపై అవగాహన పెంచడానికి భారతదేశంలో బాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాణ్యమైన చదువుల ద్వారానే మానవాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ఛాత్రోపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

భోజనశాలలో బెంచ్‌ల ఏర్పాటు

పెనగలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ఉన్నత పాఠశాలలో 1976-77 ఎస్‌ఎస్‌సీ విద్యార్థులు నిర్మించిన వంటశాలలో 2009-10 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు రూ.2 లక్షల వ్యయంతో బండ బెంచ్‌లను నిర్మించారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం సమయంలో నేలపై కూర్చొని తినకుండా గిన్నె బెంచ్‌లపై పెట్టుకుని కూర్చొని తినేందుకు అనుకూలంగా నిర్మాణం చేపట్టారు. శుక్రవారం ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మహేశ్‌నాయుడు అధ్యక్షతన పెనగలూరు ఎంఈవో-1 గిరివరదయ్య లాంఛనంగా బండ బెంచ్‌లపై భోజనం చేసే గదిని ప్రారంభించారు..

దోమతెరల వినియోగం తప్పనిసరి

ఒంటిమిట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబం దోమతెరలు ఉపయోగించి వాటిలోనే నిద్రించాలని సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని రాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కీటక జనిత వ్యాధులు, చేతుల పరిశుభ్రత, కేన్సర్ తదితర అంశాలపై అవగాహన పొందాలన్నారు. పరిసరాలను పరిశుభ్రత పాటించాలన్నారు. గుట్కా, పాన్ పరాగ్, బీడీ, చుట్టా, తంబాకుకు దూరంగా ఉండాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జమాల్‌రెడ్డి, సీహెచ్‌వో, అక్క, సిబ్బంది నాగరాణి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉద్యాన విద్యార్థులు

ఓబులవారిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొర్లకుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, గ్రామ సచివాలయం, అంకాలమ్మ ఆలయ పరిసరాల్లో శుక్రవారం డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు వేప, చింత, మారేడు మొక్కలు నాటారని కోఆర్డినేటర్లు తెలిపారు. అనంతరం విడ్స్ సంస్థ కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పొదుపు ఎంతో అవసరమని పొదుపు విధానాలపై అవగాహన కల్పించారు. పీఎంఎస్‌బీవై , పీఎంజేజేబీవై, అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ ట్రాన్సెక్షన్స్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎ.నిశ్చల, డాక్టర్ బి.హరిమల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎల్.ముకుందలక్ష్మీ, డాక్టర్ ఎం.హర్షిత, డాక్టర్ వై.దీప్తి కిరణ్, డాక్టర్ బి.రమ్యలక్ష్మీ, విడ్స్ సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్ శ్రీహరి పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపు చేయాలి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపు తప్పనిసరని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం చౌటపల్లిలో విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శక్తి సంరక్షణ పొదుపు మానవాళికి ఎంతో అవసరం అన్నారు. ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్, బల్బు అవసరం మేరకే వాడుకోవాలని, అవసరం లేనప్పుడు స్విచ్ ఆఫ్ చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ ప్యానల్స్ బిగించుకోవడం ద్వారా విద్యుత్ పొదుపుతో పాటు బిల్లు కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేశ్, ఉపాధ్యాయులు నరేశ్, నాగయ్య, ఎన్‌హెచ్‌ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష పదవికి ఎన్నికలు..!

30 ఏళ్లలో తొలిసారి.. పోటాపోటీగా ప్రచారం

రైల్వేకోడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడి పదవికి ఈ ఏడాది ఎన్నికలు నిర్వ హిస్తున్నారు. 30 ఏళ్లుగా ఈ పదవికి ఏకగ్రీవంగానే ఎ న్నుకునేవారు. ఈ సారి మాత్రం ఎన్నికలు నిర్వహిం చాలని నిర్ణయించారు.

దీంతో ఈ నెల 16న ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎన్నికలు నిర్వహించ ను న్నారు. ఇందుకు సంబంధించి నామినేషన్లు ఉపసంహరణ అనంతరం పెండ్యాల విజయ్ కుమార్, కామిశెట్టి సత్య నారాయణ పోటీలో మిగిలారు. కాగా, ఈ ఎన్నికలపై ఆర్యవైశ్య సీనియర్లు నోరు మెదపకపోగా, యువకులు మాత్రం ఎక్కువగా ఆసక్తి చూపుతూ ప్రచారంలో పాల్గొంటున్నారు. గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థుల ధర్నా

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఓబనపల్లె గ్రామస్తులు శుక్రవారం సచివాలయం-1 ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏదోటి హరినాథ్, కస్తూరి మహేశ్వర్‌రావు, కాకర్ల లావణ్య, పోలిన తేజశ్రీ మాట్లాడుతూ 20 రోజులుగా తాగునీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగడం లేదన్నారు. ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులకు విన్నపాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎక్కడి సమస్యలు అక్కడ ఉన్నాయని తెలిపారు. అధికారులు వస్తున్నారే తప్ప సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తగు చర్యలు తీసుకుని త్రాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.




సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బిహార్‌లో బీజేపీ విజయంపై సంబరాలు

రాజంపేట టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో బీజేపీ నేతలు శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో బాణ సంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ నేతలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా బీహార్ ప్రజలు ఎన్డీయే కూటమి వైపే మొగ్గు చూపారని తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుం దని నిరూపించారన్నారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కృష్ణ యాదవ్, సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు, పట్టణ అధ్యక్షుడు రమణ, రూరల్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా మాజీ కార్యదర్శి ధీరజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధికి ఆమడ దూరంలో రాయచోటి

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 9, 10వ వార్డులో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర, పట్టణ కార్యదర్శి చుక్కా జగన్‌బాబులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సి పాలిటీగా అప్‌గ్రేడ్ అయినా అందుకు తగినట్లు అభివృద్ధి కనపడలేదన్నారు. 9, 10 వార్డులు కనీస సౌక ర్యాలకు ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం 3 వేల కోట్ల నిధులు కేటాయిస్తున్నామని గొప్పలు చెప్పారే తప్ప ఆచరణలో ఎక్కడ అభివృద్ధి కనపడడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కూడా రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించక పోవడం బాధాకర మన్నారు.ఇప్పటి కైనా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందో ళనలు చేస్తామని హెచ్చరించారు.



చెత్త దిబ్బను పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

అంగన్వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ విరాళం

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోటిళ్లలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కాకుమూరి నరసింహులు ఆర్థిక సాయంతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షుడు కే. పార్థసారథి శుక్రవారం సీలింగ్ ఫ్యాన్‌ను అందజేశారు. దీంతో అంగన్వాడీ కార్యకర్త డి. కాత్యాయని, సహాయకురాలు ప్రభావతి ధన్యవాదాలు తెలిపారు.

సమస్యల పరిష్కారంలో ఏపీ ఎన్జీవో సంఘం ప్రముఖపాత్ర



రాజంపేట ఎన్జీవో కార్యవర్గ సభ్యులు

రాజంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవోల సమస్యలను పరిష్కరించి రాష్ట్ర ఎన్జీవో సంఘం ఆదర్శంగా నిలుస్తోందని ఉమ్మడి కడప జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బి.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రాజంపేట ఎన్జీవో సంఘ కార్యవర్గం ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నమయ్య జిల్లా ఎన్జీవో సంఘ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్జీవో సంఘ ఎన్నికల అధికారి నాగేశ్వర, సహాయ ఎన్నికల అధికారి నరసింహులు, పరిశీలకులు వాసన్ ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడం ఎన్జీవో సంఘ ఐక్యతకు నిద ర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా మలేరియా మాజీ అధికారి లావలూరి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైప్రసాద్‌యాదవ్, కార్యదర్శి నిత్యపూజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులను ఘనంగా సత్కరించారు. రాజంపేట ఎన్జీవో సంఘ అధ్యక్షుడుగా ఎంవరదయ్య స హాధ్యక్షుడుగా ఎన్.హరిప్రసాద్, ప్రధా న కార్యదర్శిగా తాళ్లపాక విజయకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా కె.కిరణ్, చంద్రమౌళి, విజయకుమారి, సహాధ్యక్షులుగా ఎస్.హరి ప్రసాద్, కేవీటీవీ నాయుడు, పి.వెంకటేశులు, సంయుక్త కార్యదర్శులుగా బి.సరళ, ఎం.హరిప్రసాద్, నరసింహులు, వెంకటసుబ్బయ్య, హర్షవర్ధన్, శ్రీనివాసరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాసులు రాజశేఖర్, పద్మనాభరావు, రైల్వేకోడూరు ఎన్జీవో సంఘ అధ్యక్షుడు పొలిచెర్ల ఓబులేశు, దేవేంద్ర, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల ప్రమాద బీమా

● చెక్కును అందజేసిన ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి


చెక్కును అందజేస్తున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తూ ఆగస్టు 18న ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు బి.ఈశ్వర్ నాయక్ కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా మొత్తాన్ని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అందించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో చెక్కు రూపంలో హోంగార్డు సతీమణి బి.లక్ష్మి భాయికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హోంగార్డు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, యాక్సిస్ బ్యాంకు ప్రతినిధులు, కౌంటర్ హెడ్ ప్రదీప్, మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ అబ్దుల్ రవూఫ్, గర్నమెంట్ ఆర్ఎం రాజేశ్, శాలరీ అకౌంట్ మేనేజర్ హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ గ్రామాలు అభివృద్ధి సాధించాలి


ఐపీఎస్ తరుణ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న ఎంపీడీవో, అన్నిశాఖల అధికారులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లోని గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధి సాధించాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి తరుణ్‌యాదవ్, ఐఎఫ్ఎస్ హర్షవర్థన్ తెలిపారు. మూడు రోజులుగా మండలంలోని బి.యర్రగుడి, కోనంపేట, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రజల జీవన విధానం, జీవనోపాధి కల్పన గ్రామాల అభివృద్ధి, పంచాయతీల విధి విధానాలు, భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై మూడు రోజులపాటు ప్రజలతో చర్చించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీడీవో రెడ్డెయ్య, అధికారులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో చాలా గ్రామాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రభుత్వాలు ఇలాంటి గ్రామాలపై దృష్టి సారించాలని కోరారు. సన్మానం అందుకున్న వారిలో ఐఆర్ఎస్‌లు తన్మైజాహన్, సౌరభ్‌కుమార్, ఐఆర్ఎస్‌డీ వినీత్‌జాదవ్, ఐఆర్ఎంఎస్ ఆనంద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ఈవోపీఆర్‌డీ ఉషారాణి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

● ఒక వాహనం స్వాధీనం, ఇద్దరు పరార్


పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు, ఇన్నోవాతో ఫారెస్ట్ అధికారులు

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రేంజర్ వైసీ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సానిపాయి రేంజ్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం వీరబల్లి మండలం తాటిగుంటపల్లి దగ్గర నిఘా ఏర్పాటు చేసిన అటవీ శాఖ సిబ్బందికి ఒక వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా, అది ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో వారు ఆ వాహనాన్ని వెంబడించి సుండుపల్లె మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లె దగ్గర అడ్డుకోగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 626 కేజీల 20 ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి వాటి విలువ రూ.10 లక్షలుగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. వాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడంతో పాటు, పారిపోయిన వారికోసం గాలిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రజిని, ఎఫ్‌బీవో లీల, శ్రీహరి, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

● బేస్‌బాల్, హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లలో స్థానం


బాలికలతో ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బేస్‌బాల్ జిల్లా జట్టులో నాగచైతన్య, అండర్-17 విభాగంలో సంధ్య, హ్యాండ్‌బాల్ అండర్-14లో ఆసిఫా, చందుప్రియ, దీపిక ప్రధాన జట్టుకు ఎంపిక కాగా స్టాండ్‌బైగా జైబా, అండర్-17 జట్టుకు అహనా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షకీరాబేగం, ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి శుక్రవారం తెలిపారు. బేస్‌బాల్ అండర్-17 రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 26 నుంచి నంద్యాలలో, అండర్-14 బేస్ బాల్‌పోటీలు 29 నుంచి చిత్తూరు జిల్లా పలమనేరులో, అండర్-14 హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు కలికిరిలో జరుగుతాయని ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు.

స్టేట్ లెవెల్ క్రికెట్ పోటీలకు ఉపాధ్యాయులు


రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మండల ప్రభుత్వ ఉపాధ్యాయులు

గాలివీడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్న మెంట్‌లో భాగంగా ఈ నెల 11 నుంచి 13వ తేది వరకు నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో క్రికెట్ విభాగంలో గాలి వీడు ఉపాధ్యాయులు ప్రతిభ చూపారు. మండల ఎస్టీయూ సభ్యులు దేరంగుల రామేశ్వర్, మడితం రమణయ్య, పి.సురేశ్‌కుమార్ ఎంపికైనట్లు ఎంఈవోలు పి.నాగరాజు, వి.శ్రీనివాసులు తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 22 వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న స్టేట్ లెవెల్ ఎంపిక పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఎంఈవోలు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహంపై బ్లూ కలర్ ప్యాంటు, గోధుమ రంగు గళ్ల షర్టు ఉంది. రైల్వేకోడూరు ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్యమే మృతికి కారణమై ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇతర వివరాలు తెలియరాలేదని పోలీసులు వివరించారు.



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రారంభించి... మోకాలొడ్డి

● అర్ధాంతరంగా ఆగిన రహదారి పనులు
● ఐదేళ్లుగా పూర్తికాని పనులు
● నిత్యం ప్రమాదాల్లో పోతున్న ప్రాణాలు
● కూటమి పాలనలోనూ పడని ముందడుగు


ప్రమాదకరంగా కూలేందుకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

సుండుపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-సుండుపల్లె ప్రధాన రహదారి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. రహదారుల అభివృద్ధికి గత ప్రభుత్వం మోకాలడ్డుతూ వచ్చింది. అధ్వానంగా ఉన్న రహదారుల అభివృద్ధికి అరకొరగా నిధులిచ్చి చేతులు దులుపుకొంది. రూ.కోట్ల విలువైన పనులను నిలిపేయడంతో రహదారులపై వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఆటోలు, బస్సులు, కార్లు, లారీలు, టిప్పర్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఈ రహదారిలో జరిగిన ప్రమాదాల వలన పదుల సంఖ్యలో ప్రాణాలు పోగా, అనేక మంది క్షతగాత్రులై అవస్థలు పడుతున్నారు. పనులు ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేయడం వలన రహదారి గుంతలమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. కారులో, బస్సుల్లో వెళ్లాలన్నా, రావాలన్నా గుంతలతో హైరానా తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇప్పటి వరకు ముందడుగు పడలేదు. కూటమి నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రయాణికులు పలుమార్లు జిల్లా అధికారులకు, రవాణా శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.


ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణం

సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి

- రామాశ్రీనివాస్, జనసేన నాయకుడు



సీఎం, డిప్యూడీ సీఎంల దృష్టికి రహదారి దుస్థితి, ఝరికోన కాలువల విషయం తీసుకెళ్లాను. అంతేగాకుండా రహదారి, భవనాల శాఖ మంత్రి, జిల్లా సర్వోన్నత అధికారికి పలుమార్లు వినతిపత్రం అందజేశాను. త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని చెబుతున్నారు.

గతంలో అటవీ అనుమతుల సాకు

వైసీపీ పాలనలో డబుల్ రోడ్డు పనులను ప్రారం భించారు. అయితే సకాలంలో నిధులు కాంట్రా క్టర్లకు అందించకపోవడం వలన పనుల్లో జాప్యం జరిగింది. పైగా రాయచోటి నుంచి సుండుపల్లెకు వచ్చే మార్గమధ్యంలో అటవీ ప్రాంతం ఉండడం వలన అటవీశాఖ అనుమతుల పేరిట దాదాపు ఏడాదికి పైగా ప్రజలను మభ్యపెట్టారు. అయినా గత ప్రభుత్వంలో అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రధానంగా సుండుపల్లె, రాచంవాండ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రం నుంచి అనుంపల్లి అటవీ ప్రాంతంలో రహదారి ఇరువైపులా మట్టి కోతతో ప్రధాన రహదారి నుంచి ఎదురుగా వాహనం వచ్చే సమయంలో పక్కకు దిగి ఎక్కాలంటే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సుండుపల్లె-దిగువ గుల్లావాండ్లపల్లె నుంచి సుండుపల్లె విద్యుత్ ఉపకేంద్రం వరకు కూడా సిమెంటు రహదారి పనులు జరగాల్సి ఉంది.

ఐదేళ్లుగా సాగుతున్న పనులు

రాయచోటి-సుండుపల్లె మార్గంలో 20 కి.మీ. మేర రహదారిని విస్తరించేందుకు ఎన్‌డీబీ కింద రూ.61.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో రాయచోటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి శిబ్యాల, అనుంపల్లి మధ్య రహదారిని మొదలు పెట్టి వదిలేశారు. ఈ మార్గంలోని శిబ్యాల వంకపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు పక్కనే నూతన వంతెన నిర్మాణానికి కడ్డీలు అమర్చి స్లాబ్ వేయకపోవడంతో అవి తుప్పు పట్టాయి. రాయచోటి నుంచి సుండుపల్లె, రాయవరం, పింఛా, కేవీపల్లి, చీనేపల్లి, పీలేరు, రాజంపేటలకు బస్సులు వెళుతున్నాయి. అతుకుల రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రాయచోటి- రాజంపేట రహదారిని 16 కి.మీ. మేర విస్తరించాల్సి ఉండగా పనులు ఉన్నపళంగా నిలిపేశారు.

కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలి

- విశ్వనాథరెడ్డి, రాయచోటి లీగల్ సర్వీస్ కమిటీ మాజీ సభ్యుడు



రాయచోటి- సుండుపల్లె రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా సంవత్సరాల తరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు సరికాదు. అదే సమయంలో ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు నిధులు కేటాయించాలి.


అటవీప్రాంతంలో ప్రమాదాలకు నిలయమైన తారు రోడ్డు

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● జిల్లా ఉప విద్యాశాఖ అధికారి డాక్టర్ నాగయ్య


వికలత్వ నిర్ధారణ శిబిరానికి హాజరైన వారు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని డిప్యూటీ డీఈవో డాక్టర్ ఎల్.నాగయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాయచోటి నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల కోసం సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్దన్ ఆధ్వర్యంలో వైకల్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ గతంలో కంటే నేడు ప్రభుత్వం రవాణా, ఎస్కార్డ్, స్టైఫండు, ఇంటి వద్ద విద్యకు రెట్టింపు అలవెన్స్‌లు ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలు పాఠశాలలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు చూడాలని కోరారు. నిర్ధారణ పరీక్షలకు హాజరైన విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ స్కూటర్, ట్రైసైకిల్, వీల్ చైర్స్, రోలేటర్స్, చంక కర్రలు, వినికిడి యంత్రాలను నెలరోజుల్లోగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ వెంకట్రామయ్య, జీసీడీవో సుమతి, ఏఎస్‌వో అసదుల్లా, ఎంఈవోలు ఆంజనేయనాయుడు, జయచంద్ర, అలీమ్, వైద్యులు శివాసిస్, శివప్రకాశ్, ఆడియాలజిస్ట్ మమత, సమ్మిళిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు

● హాజరు కానున్న 13 జిల్లాల క్రీడాకారులు


మైదానంలో బేస్‌బాల్‌ను ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారులు

రైల్వేకోడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూలు మైదానంలో శనివారం నుంచి సోమవారం వరకు ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 అధ్యక్షుడు టీఎస్‌వీ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యశోధర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు అనువుగా మైదానం తయారు చేశామని తెలిపారు. ఈ పోటీల్లోనే ప్రతిభ కల్గిన క్రీడాకారులను ఎంపిక చేసి జనవరిలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్లను పంపిస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు వచ్చి ఉన్నారని తెలిపారు.

లింగ వివక్షపై విస్తృతంగా అవగాహన కల్పించాలి

● డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న లింగ వివక్షకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వర రావు అన్నారు. పీలేరు సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఆయన జెండర్ కమిటీల ఏర్పాటు, లింగ వివక్షపై పోరాటంపై నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ అమ్మ కడుపులో నుంచి మరణించే వరకు సమాజంలో మహిళలు అనేక విధాలుగా వివక్షకు గురవుతున్నారన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున ఈ సమస్యను రూపుమాపడానికి క్షేత్రస్థాయిలో చర్చలు, సమావేశాలు, శిక్షణ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను చైతన్యవంతుల్ని చేస్తున్నామన్నారు. లింగ వివక్షపై పోరాడేందుకు గ్రూపు, గ్రామ, మండల స్థాయిల్లో ఒక సోషియల్ యాక్షన్ టీంను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ టీంల ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చే వివక్ష ఉదంతాలను ఆ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నం చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే జిల్లాలో రాయచోటి, పీలేరు, మదనపల్లెల్లో మూడు జెండర్ రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సెర్ప్ రూపొందించిన కరపత్రాలను ఏపీఎంలు, సీసీలకు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం ధర్మరాజు, రిసోర్స్ పర్సన్ కిజర్ హయాత్ ఖాన్, ఏసీ జవహర్, ఏపీఎంలు అనూరాధ, నర్సోత్తమ రెడ్డి, దేవసేన, పురుషోత్తం రెడ్డి, రజనీ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సక్రమ జీవనశైలితోనే మధుమేహం నియంత్రణ

● జిల్లా అదనపు వైద్యాధికారి రాధిక

రాయచోటిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సరైన జీవనశైలిని అనుసరించడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రాధిక, పారా మెడికల్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల పరిరక్షణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో 165 దేశాల్లో ప్రజలు ఈ వ్యాధికి గురయ్యారన్నారు. మధుమేహం దీర్ఘకాలిక వ్యాధి అని, అశ్రద్ధ చేస్తే గుండెపై ప్రభావం, కంటి చూపు మందగించడం, శరీరంపై గాయాలు మానకపోవడం, నరాల బలహీనత, పక్షవాతం లాంటివి సంభవిస్తాయన్నారు. ఒకసారి మధుమేహం బారిన పడితే దానిని నిర్మూలించడం సాధ్యం కాదన్నారు. తీవ్రమైన అలసట ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని, సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డెమో దేవశిరోమణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు



వీరభద్రాలయంలో లక్ష గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు, పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కార్తీకమాస శుక్రవారం సందర్భంగా భద్రకాళీ అమ్మవారు లక్ష గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు రాహుకాల పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అన్నదానం చేశారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణయ్య స్వామి పాల్గొన్నారు.

త్వరలో డిజిటల్ పేమెంట్స్

● సహకారశాఖకు రిజర్వ్ బ్యాంకు అనుమతి
● టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్


సహకార వారోత్సవాల్లో మాట్లాడుతున్న విద్యాసాగర్

మదనపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా డిజిటల్ పేమెంట్‌కు రంగం సిద్ధం చేశామని టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ అన్నారు. స్థానిక కో-ఆపరేటివ్ పట్టణ బ్యాంకులో శుక్రవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ నెలాఖరులో టౌన్‌బ్యాంకు శత వసంతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార సంస్థల్లో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పారదర్శకత అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా బ్యాంకులో డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా ఫోన్-పే, గూగుల్ పే, పేటీఎం అమలుకు, మొబైల్ బ్యాంకింగ్ సదుపాయాల కల్పనకు రిజర్వు బ్యాంకు అనుమతి ఇచ్చిందని, నెలాఖరులో ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి రోషన్ జమీర్ మాట్లాడుతూ టౌన్‌బ్యాంకు వందేళ్లు పూర్తి చేసుకోవడం శుభపరి ణామన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ పి.వి.ప్రసాద్, బ్యాంకు ఉపాధ్యక్షుడు ఎస్.భాస్కర్ కుమార్, డైరెక్టర్లు రవీంద్ర నాథ్, రవికాంత్, ముక్తియార్‌ఖాన్, సోమశేఖర్, నాదెళ్ల శివ, ఆకుల కృష్ణమూర్తి, సర్దార్‌ఖాన్, జె.దేవేంద్ర, భాస్కర్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి


మృతిచెందిన వెంకటసాయి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ టిల్లర్ కిందపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన సంబేపల్లె మండలం శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లెలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గాండ్లపల్లికు చెందిన భారతి భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో కలిసి తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటోంది.. ఆమె పెద్ద కుమారుడు షణ్ముఖ వెంకటసాయి (12) శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలం వద్దకు వెళ్లి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఎక్కి స్టార్ట్ చేశాడు. దీంతో భయపడి వెనుకకు పడిపోవడంతో మృతి చెందాడు. ఆ బాలుడు అడవికమ్మపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు.

దత్తత.. సామాజిక బాధ్యత

- స్త్రీశిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి

రాయచోటి నేతాజీసర్కిల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దత్తత ప్రేమతో కూడిన సామాజిక బాధ్యత అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి హైమావతి తెలిపారు. శుక్రవారం దేవపట్ల బాలయోగి గురుకుల విద్యాలయంలో బాలల దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మాస వారోత్సవాల సందర్భంగా దత్తత తీసుకోవడాన్ని బలోపేతం చేయడం, ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు కుటుంబం ఆధారిత సంరక్షణ అందిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో ఉదయశ్రీ, ఎంఈవో శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, గుడ్ నైబర్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, బాలయోగి గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మధుమతి, ఏఎస్ఐ నాగమణి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి



స్కానింగ్‌లకు ఆంక్షల సంకెళ్లు!

- అందని ద్రాక్షలా రోగ నిర్ధారణ
- ఆస్పత్రిలో చేరితేనే స్కానింగ్ రాస్తారట
- వెనుతిరుగుతున్న పేద రోగులు
- జిల్లా ఆస్పత్రిలో బోసిపోతున్న సీటీ, ఎంఆర్ఐ విభాగాలు

అక్కడ చికిత్స మాట దేవుడెరుగు. అసలు రోగమేంటో తెలియాలంటే ఆంక్షల తీరం దాటాల్సిందే. కళ్లెదుట ఎంఆర్ఐ, సీటీస్కానింగ్ విభాగాలు కనపడుతున్నా వాటికి నిబంధనల సంకెళ్లు విధించారు. రెండు రోజులు ఆస్పత్రిలో అడ్మిట్ అయితే తప్ప స్కానింగ్ రాయమంటున్నారు వైద్యులు. దీంతో ఏంచేయాలో అర్థం కాక.. ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో వేల రూపాయలు చెల్లించలేక జిల్లా ఆస్పత్రికి వచ్చిన నిరుపేదలు వ్యాధి నిర్ధారణ కాకుండానే వెనుతిరిగే పరిస్థితి నెలకొంది.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సుమారు ఎనిమిది మండలాల పేద, మధ్యతరగతి ప్రజలకు సేవలు అందిస్తోంది. ఇక్కడ ప్రతి రోజు 900 నుంచి 1100 వరకు ఓపీ ఉంటుంది. ఇక్కడికి ప్రొద్దుటూరు పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలు అయిన మైదుకూరు, చాపాడు, రాజుపాళెం, దువ్వూరు, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల, ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాల నుంచి వైద్యం కోసం రోగులు వస్తుంటారు. జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే మొదలుకొని అన్ని రకాల స్కానింగ్‌లను ఉచితంగా చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు కొన్నేళ్ల కిందట ఏర్పాటయ్యాయి. ఏ రోజు కూడా సేవలు అందించడంలో ప్రజలకు ఇబ్బంది కలుగలేదు.

జాయింట్ కమిషనర్ ఆదేశాలతో

ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్‌కిశోర్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో ప్రజలకు వైద్యం ఎలా అందుతుంది, రోజుకు ఎంత మంది చికిత్స చేయించుకుంటున్నారు. మందుల సరఫరా తదితర వాటిపై ఆయన ఆస్పత్రి అధికారులతో మాట్లాడలేదు. వైద్యులను పిలిపించి సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లను ఇష్టానుసారంగా రాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ విభాగాల్లో అధిక మొత్తాల్లో స్కానింగ్‌లు రాయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లు రాయొద్దంటూ హుకుం జారీ చేశారు. అప్పటి నుంచి జిల్లా ఆస్పత్రిలో ఆంక్షల పర్వం మొదలైంది.

ఆస్పత్రిలో చేరితోనే స్కానింగ్

ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లలో సిటీస్కాన్ తీయించుకుంటే మూడు నుంచి రూ.6 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎంఆర్ఐ స్కానింగ్ అయితే రూ.4 వేల నుంచి రూ.14 వేల వరకు రోగులు చెల్లించాల్సి ఉంటుంది. వేలాది రూపాయలు చెల్లించే స్థోమత లేని నిరుపేదలు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయిస్తే ఆంక్షలు భయపెడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు మినహా ఓపీ ప్రాతిపదికపై ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లు వైద్యులు రాయడంలేదు. ఆస్పత్రిలోని ఆర్ఎంవో, సూపరింటెండెంట్‌లకు కూడా ఈ స్కానింగ్‌లు రాసే అధికారం లేదట. ఒకవేళ రాస్తే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుందని జంకుతున్నారు. కేవలం ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు మాత్రమే ఈ స్కానింగ్‌లను రాస్తున్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ కోసం ఆస్పత్రికి పేద ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.



బోసిపోయిన సీటీస్కానింగ్ విభాగం



ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఆర్ఐ స్కానింగ్ విభాగం

బోసిపోయిన రెండు విభాగాలు

ఇది వరకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లలో 12 మంది సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించేవారు. దీంతో రోజుకు 45 నుంచి 60 వరకు సిటీ స్కానింగ్‌లు చేసేవారు. ఎంఆర్ఐ స్కానింగ్‌లు నిత్యం పాతికపైనే నడిచేవి. ప్రస్తుతం కొనసాగుతున్న ఆంక్షలు కారణంగా ఎంఆర్ఐ స్కానింగ్ సంఖ్య పది దాటడంలేదు. సిటీస్కానింగ్‌లు సగానికి సగం తగ్గిపోయాయి. వారాంతపు చివరి రోజుల్లో ఈ విభాగాలు దాదాపు నిలిచిపోయి బోసిపోతున్నాయి. దీంతో ఈ తరహా ఆంక్షలు ఒక్క ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఉన్నాయని, రాష్ట్రంలో మరెక్కడా లేవని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఉన్నతాధికారులు పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిబంధనలు సులువుతరం చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం.

జాయింట్ కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలు అమలు చేస్తున్నాం. ఆయా విభాగాలకు చెందిన సివిల్ సర్జన్లు రోగిని పరీక్షించి స్కానింగ్ అవసరం అనిపిస్తే.. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకుని స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు, అత్యవసర కేసుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నాం. రోగులకు ఇబ్బందిగా మారినప్పటికీ నిబంధనలు అమలు చేయక తప్పదు.

-డాక్టర్ సుజాత, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్

సైనికుడి విగ్రహం ఏర్పాటు



సైనికుడి విగ్రహం అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాష

మదనపల్లె అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మదనపల్లె మాజీ సైనికులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సైనికుడి విగ్రహం ఏర్పాటు చేశారు. విగ్రహం ప్రారంభించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాష మాట్లాడుతూ దేశానికి రక్షణ కల్పించడంలో సైనికుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికులు మదనపల్లె డివిజన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసులు నాయుడు, మాజీసైనికులు పాల్గొన్నారు.

సైబర్ ముప్పు గుర్తించడంలో డీప్ లర్నింగ్ మోడల్స్ పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న సప్తగిరి ఏలుమలై

కురబలకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ముందస్తుగా ముప్పును గుర్తించడంలో డీప్ లర్నింగ్ మోడల్స్ పాత్ర కీలకమని రిసోర్స్‌పర్సన్ సప్తగిరి ఏలుమలై విద్యార్థులకు పిలుపు నిచ్చారు. డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీలో ఏఐ-మెషిన్ లర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో డీప్ లర్నింగ్ మోడల్స్ ఫర్ ప్రిడిక్టివ్ సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్ అంశంపై అవగాహన నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ రంగంలో డేటాను పరిరక్షించడానికి ఎంతో శ్రమించాల్సి ఉంటుందని, కొన్ని వేళల్లో డేటా చోరీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వీటిని ముందుగానే పసిగట్టి అంచనా వేయడంతో సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ప్రధానంగా న్యూరల్ నెట్‌వర్క్‌లు, ఎల్ఎస్‌టీఎం, సీఎన్ఎన్, ట్రాన్స్ ఫార్మర్ మోడల్స్‌ను ఉపయోగించి దాడులను అంచనా వేసి భద్రతను పెంచవచ్చన్నారు. ప్రపంచ సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు నూతన సాంకేతికతలపై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రధానంగా సాంకేతికతపై దృష్టి సారించి టెక్నాలజీలకు అనుగుణంగా పట్టు సాధించాలని దీంతో మెరుగైన ఉపాధి అవకాశాలను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనాథమ్, విభాగాధిపతి పద్మ, కోఆర్డినేటర్ శివరామన్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలి

పెద్దమండ్యం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సమస్యలు పరిష్కరించాలని పెద్దమండ్యం మండల వడ్డెర్లు కోరారు. బండమీదపల్లి పంచాయతీ తురకపల్లి వడ్డెర్ల సంఘం నేతల సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డెర్లకు కూడా క్వారీలు కేటాయించాలన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుతో రాష్ట్ర వడ్డెర్ల ప్రజాగళం నేతలు మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమణ, సాంబ, మేకల చలపతి, శివ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి ఎంపీడీఓగా ఫక్రుద్దీన్ సాహెబ్

నిమ్మనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి అధికారిగా ఫక్రుద్దీన్ సాహెబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లా డోన్ మండలం డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తూ పదోన్నతిపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తాయని తెలిపారు. ఏఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, సిబ్బంది స్వాగతం పలికారు.

బాలిక అదృశ్యం



మైలవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దొడియం గ్రామంలో కె.మౌనిక బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం మూలపల్లికి చెందిన మౌనిక దొడియం గ్రామంలో పిన్నమ్మ ఉండడంతో వారి ఇంటికి వచ్చి ఇక్కడే ఉండేది. ఈ క్రమంలో బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఎంతసేపటికీ రాలేదు. దీంతో ఎక్కడ వెదికినా కనిపించకపోవడంతో మౌనిక పిన్ని రాజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ కార్పెంటర్ మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ కార్పెంటర్ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం, సైదాపేటకు చెందిన జాకీర్ హుసేన్ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు నవంబరు 11న బీకేపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జాకీర్ హుసేన్ గాయపడ్డాడు. అతన్ని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మదనపలె టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు

జిల్లాస్థాయి హాకీ ఎంపికలకు అనూహ్యస్పందన





ఎంపికైన బాలురు, బాలికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రిమ్స్ సమీప వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి హాకీ బాల, బాలికలు ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ఔత్సాహిక బాల, బాలికలు దాదాపు 80 మంది హాజరయ్యారు. స్పోర్ట్స్ స్కూల్ హాకీ కోచ్‌లు అనిల్, ఖాదర్‌బాష ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. పర్యవేక్షకులుగా రాజంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ పీడీ మురళీ కృష్ణారెడ్డి, రామనపల్లి జడ్పీహెచ్ఎస్ పీడీ పోలంకి గణేష్ బాబు హాజరయ్యారు. హాజరైన బాల, బాలికల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో టి.కావ్య, డి.హన్సిక, సి.బాస్మిన్, పి.హర్షిత, సి.శరణ్య, బి.మహాలక్ష్మి, పి.సునయన, ఎం.నాగనందిని, పి.గంగాకావ్య, ఎస్. ప్రశాంతి, ఎం.అమృతాదేవి, వి.మనీషా, కె.స్నేహిత, ఎన్.హరిత, బి. రాణి, పి.ప్రణతి, వై.సంజన, బి.అమృతతో పాటు స్టాండ్‌బైగా ఎల్. లక్ష్మీ, కె.హరిప్రియ, ఏ.ప్రణవి, టి. శివజ్యోతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో సి.శరణ్ కుమార్‌రెడ్డి, సీహెచ్ అమర్‌నాథ్, డి.సుశాంత్, కె.గీతేశ్వర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.ఇస్మాయిల్, వెంకటలిఖిత్, జె.అభినవ్, ఎ.మనోజ్‌కుమార్, ఎన్.వెంకటజగత్, ఎస్. ఇర్ఫాన్‌బాష, ఎ.రాజు, ఎంవీ విష్ణువర్ధన్, వి.సాయిమోహన్, జి. అనూప్‌కుమార్, జె.మహేష్‌బాబు, ఎ.రిషిత్ వర్మ, జి.మంజునాథ్, స్టాండ్‌బైగా ఎస్.సోహైల్, ఎ.చరణ్, ఓ.హరిప్రసాద్ ఎంపికైన వారిలో ఉన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించండి

తంబళ్లపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులో నెలకొన్న చెత్త సమస్యను పరిష్కరించాలని స్థానిక రైతులు డిప్యూటీ ఎంపీడీఓ ప్రసాద్‌ను కోరారు. మల్లయ్యకొండకు వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డులో పట్టణంలో సేకరించిన చెత్త, చెదారం తోలుతుండడంతో దుర్గంధం వెదజల్లుతూ, కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల పొలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ డంపింగ్ యార్డుకు ఆనుకునే అక్కమ్మ చెరువుకు వెళ్లే నీటి కాల్వ ఉండడంతో వర్షాలు కురిసినపుడల్లా చెత్తా, చెదారం ఆ నీటిలో చెరువులోకి కొట్టుకుని వచ్చి నీరు కాలుష్యం అవుతోందన్నారు. అంతేకాకుండా యార్డు రోడ్డు పక్కనే ఉండడంతో చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డులో కాకుండా ఊరికి దూరంగా తరలించాలని పలువురు రైతులు కోరారు. కార్యక్రమంలో స్థానిక రైతులు రామచంద్ర, కొండప్ప, రవి, ప్రభాకర, చంద్ర, శీన, గౌస్ తదితరులు ఉన్నారు.

కరపత్రాల పంపిణీ

రామసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఈనెల ఆదివారం జరిగే మాలమహానాడు రాష్ట్ర సభను విజయవంతం చేయాలని కోరుతూ మండల మాలమహానాడు అధ్యక్షుడు టి.కృష్ణప్ప చెక్‌పోస్టు కూడలిలో కరపత్రాలు పంపిణీ చేశారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శివశంకర్, మాలమహానాడు నేతలు కొమ్ము నారాయణస్వామి, నీరుగట్టు కృష్ణప్ప, సమతా సైనిక్ దళ్ మండల అధ్యక్షుడు నీరుగట్టు జయరాజ్, వైస్ ప్రెసిడెంట్ బాలాజీ, వైసీపీ ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నీరుగట్టు శివ, రాజశేఖర్, దొడ్డిపల్లె వెంకటరమణ, మణి పాల్గొన్నారు.

రేపటి మహాసభను విజయంతం చేయండి

మదనపల్లె అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఆదివారం నిర్వహించే మాలమహానాడు రాష్ట్ర సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు యమలా సుదర్శనం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు యమాల చంద్రయ్య, గుండా మనోహర్, మోహన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట చెరువును కాపాడాలని వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని జమ్మికుంట చెరువును కాపాడాలని పలు ప్రజా సంఘాల నేతలు రెవెన్యూ అధికారులను కోరారు. డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాశ్ మాట్లాడుతూ జమ్మికుంట చెరువు, దాని పక్కన ఉన్న ప్రభుత్వ భూములను కొందరు రియల్టర్లు ఆక్రమించి లే-ఔట్లు వేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. జమ్మికుంట చెరువు ఎన్నో దశాబ్దాలుగా ఆవులు, మేకలు, ఇతర పశువులకు నీటి కుంటగా ఉండేదన్నారు. ప్రస్తుతం అది కనుమరుగయ్యే దశలో ఉందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో వెలసిన లే-ఔట్లలను పరిశీలించి జమ్మికుంట చెరువును కాపాడాలన్నారు. అనధికార లే-ఔట్లను రద్దు చేయాలని, అనుమతులు లేకుండా లే-ఔట్లు వేసి ప్లాట్లను అమాయక ప్రజలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మాలమహానాడు, ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ నేతలు తుమ్మల ధరణీ కుమార్, అమృతతేజ, దుబ్బా శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగరాజు

ములకలచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వంద శాతం పన్ను వసూలు చేసి అభివృద్ధికి సహకరించాలని మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు అన్నారు. పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. బురకాయలకోటలోని ఇంటింటికీ చెత్తసేకరణ, చెత్త సేకరణ కేంద్రాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ ఎంపీడీఓ మోహన్ ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

పీలేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని డీవైఈఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలో జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. మెయిన్ మోడల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీవైఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య అందిస్తున్నామన్నారు. ఎంఈఓ-2 పద్మావిత, హెచ్ఎం సద్దల రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూముల గుర్తింపు


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దతిప్పసముద్రం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా చేపడుతున్న స్వామిత్వ సర్వే ద్వారా ఆయా గ్రామాల్లో గ్రామకంఠం భూములను గుర్తిస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. శుక్రవారం మల్లెల గ్రామంలోని అమ్మళ్లబండకోట రెవెన్యూ గ్రామంలో సర్పంచ్ శ్రీకంఠరెడ్డి అధ్యక్షతన స్వామిత్వ సర్వే గ్రామసభలను నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో గృహాలకు సరైన పత్రాలు లేకపోవడం, గృహాలకు సరైన కొలతలు లేకపోవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం స్వామిత్వ సర్వే పేరుతో ప్రత్యేక యాప్ ద్వారా గ్రామకంఠం భూములను గుర్తించి వాటిని సిబ్బంది పర్యవేక్షణలో కొలతలువేసి ఆన్‌లైన్ ద్వారా రికార్డులను తయారు చేసి సంబంధిత రైతులకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ స్థలాలకు డిజిటల్ శాశ్వత పత్రాలను అందిస్తామన్నారు. గ్రామసభలో అధికారుల దృష్టికి వచ్చిన అమ్మళ్లబండకోటలో కబ్జాకు గురైన స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి నాగరాణి, విజయదేవర రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, అమ్మనమ్మ, శంకర తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ జీతాల విడుదలపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న ఇమ్దాదుల్లా

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్ల జీతాల విడుదలపై ఏపీఎస్ ఎన్‌డీసీ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఇమ్దాదుల్లా హర్షం వ్యక్తం చేశారు. పీలేరులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024 ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలను జగన్ పెండింగ్‌లో పెడితే కూటమి ప్రభుత్వం అధికారం చేపడతూనే డిసెంబరు వరకు వేతనాల కోసం 2025 ఫిబ్రవరిలో రూ.45 కోట్లు మంజూరు చేసిందన్నారు. అదే విధంగా 2025 జనవరి నుంచి సెప్టెంబరు వరకు 9 నెలల వేతనాల కోసం రూ.90 కోట్లు విడుదల చేశారని ఆయన తెలిపారు. ముస్లిం ఇమామ్, మౌజన్లకు జీతాలు, మసీదుల నిర్మాణం, షాదీ మహళ్ల ఏర్పాటు, హజ్ యాత్రికులకు రాయితీలు వంటి పథకాలను అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఇమామ్‌లు, మౌజన్ల జీతాలు విడుదల చేసినందుకు రాజంపేట పార్లమెంటు ముస్లిం మైనారిటీ మహిళా అధ్యక్షులు షేక్ షబానా సైతం హర్షం వ్యక్తం చేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో నూర్ బాషా సంఘ సభ్యులు హైదర్ అలీ, అహ్మద్ బాషా, మౌల్వీ హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను విమర్శించే అర్హత ఎంపీకి లేదు

జనసేన నేత మైఫోర్సు మహేష్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మైఫోర్సు మహేష్

మదనపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత పెద్దిరెడ్డి కుటుంబానికి, ఎంపీ మిథున్‌రెడ్డికి లేదని జనసేన రాష్ట్రసంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మంగళంపేట అటవీప్రాంతంలో పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన 3.263ఎకరాలపై పవన్‌కళ్యాణ్ మాట్లాడితే, ఎంపీ విమర్శించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అటవీభూముల్లో ఫాంహౌస్‌లు, అసైన్డ్ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల కబ్జా, అనుమానం వస్తే ఫైళ్లు కాల్చివేతతో చేతికి మట్టి అంటకుండా, తెరపై కనిపించకుండా భూకబ్జాలు చేయడంలో పెద్దిరెడ్డి కుటుంబం దిట్ట అంటూ ఆయన ఆరోపించారు. ఈ భూముల కేసులో ఏ-1గా మిథున్‌రెడ్డి, ఏ-2గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏ-3గా పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్లు ఉన్నాయని, వాటిని ఒకసారి చెక్ చేసుకోవాలని ఎంపీకి సూచించారు. మొదట మీ నిజాయితీని నిరూపించుకుని, తర్వాత పవన్‌కళ్యాణ్‌పై మాట్లాడాలని హితవు పలికారు. ది వైల్డ్ ఈస్ట్ పుస్తకంలో మీ నాన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిజస్వరూపం క్లియర్‌గా ఉందని, చిన్న కాంట్రాక్టర్ నుంచి కెరియర్ మొదలు పెట్టి, ఇల్లీగల్ ఆల్కహాల్ కాంట్రాక్టు స్థాయికి రాజకీయ ముసుగులో ఎలా ఎదిగారో ఆ పుస్తకంలో రాశారని, కావాలంటే దాన్ని తీసుకుని చదువుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జనసేన నేతలు చిరంజీవి, రెడ్డిప్రసద్, శోభ, సునీత పాల్గొన్నారు.

రామసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ మాట్లాడుతూ బాలలు క్రమశిక్షణతో మెలుగుతూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. బాలల దినోత్సవం సందర్భంగా అన్ని జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు ఆటలు, సాంస్కృతిక, వ్యాసరచన, తదితర పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కురబలకోటలో...

కురబలకోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల బాలికలు సమాజమార్గదర్శకులుగా ఎదగాలని ఎంఈఓ ద్వారకనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంగళ్లు, కురబలకోట, తెట్టు, ముదివేడు తదితర ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలలదినోత్సవం నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. హరిజనవాడ ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

గుర్రంకొండలో...

గుర్రంకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చదువుకు ఉన్న ప్రాముఖ్యతను గ్రంథాలయాధికారి రెడ్డికుమారి వివరించారు.

నిమ్మనపల్లిలో...

నిమ్మనపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని చేశారు. ఆయన చిత్ర పటానికి నివాళులర్పించిన ఎంఈఓ-2 నారాయణ మాట్లాడారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు అంజాద్, భాస్కర, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా బాలల దినోత్సవం

జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి నివాళులు ● విజేతలకు బహుమతులు అందజేత


కురబలకోటలో సాంస్కృతిక కార్యక్రమాలు - కలకడలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు - నిమ్మనపల్లిలో బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ నారాయణ

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లెలో, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నవ భారత నిర్మాణంలో నెహ్రూ పాత్రపై ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జిలాని బాష, సిబ్బంది సరోజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలకడలో...

కలకడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవం చేసుకున్నారు. బాటవారిపల్లి హైస్కూల్లో హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు లోకా జగన్నాథశాస్త్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో...

పెద్దమండ్యం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) మండలంలోని కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం జరిగాయి. భారత మొదటి ప్రధాని చాచా నెహ్రూ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో...

బి.కొత్తకోట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో బాలలదినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రిన్సిపాల్ లిశానందిని మాట్లాడుతూ మాట్లాడుతూ నెహ్రూ పంచశీల ఒప్పందంలో కీలకపాత్ర పోషించారన్నారు. పాఠశాల సిబ్బంది సాయిలీల, పద్మావతి, కుమారి, హనుమంత్‌రెడ్డి, కేశవులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో గుడిసెలు

తొలగించిన రెవెన్యూ అధికారులు ● రెడ్డీస్‌కాలనీలో తరచూ ఘర్షణలు


రెడ్డీస్‌కాలనీలో వివాదాస్పద భూమిలో వెలసిన గుడిసెలు

మదనపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రెడ్డీస్‌కాలనీలో వివాదాస్పద భూమిలో శుక్రవారం గుడిసెలు వెలిశాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెళ్లి వాటిని తొలగించారు. రెవెన్యూ రికార్డుల పరంగా ఇది ప్రభుత్వ భూమిగా నమోదైందని, ఇందులో ఎవరు ప్రవేశించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2001లో తమకు పట్టాలు ఇచ్చారంటూ కొందరు వెళ్లి తరచూ కట్టెలతో తాత్కాలికంగా గుడిసెలు ఏర్పాటు చేయడం, రెవెన్యూ అధికారులు వెళ్లడం, తొలగించడం తరచూ అక్కడ వివాదాలు చోటుచేసుకోవడం ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

బి.కె.పల్లె సర్వేనంబర్ 153లో 1.72 ఎకరాల ప్రభుత్వ భూమిని వాల్మీకిపురం వాసి వెంకటరమణారెడ్డికి మాజీసైనికుడి కోటాలో 1990లో పట్టా ఇచ్చినట్లు చెబుతున్నారు. తర్వాత ఆయన మరొకరికి విక్రయించారు. ఈ క్రమంలో ఆ సర్వే నంబర్‌కు ఇటు, ఇటు ఉన్న రైతులు ఆ భూమి తమ అధీనంలో ఉందని కోర్టుకు వెళ్లారు. అయితే వెంకటరమణారెడ్డి నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి కోర్టుకు వెళ్లిన వారితో కేసు రాజీ కుదుర్చుకోవడంతో వివాదం సద్దుమణిగింది. తర్వాత జరిగిన పరిణామాల్లో వెంకటరమణారెడ్డి పొజీషన్‌లో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అప్పటికే తమకు పట్టాలు ఇచ్చినట్లు చెబుతున్న ఓ సంఘానికి అమ్మచెరువుమిట్ట వద్ద స్థలం కేటాయించినట్లు చెబుతున్నారు. అయితే తిరిగి వారంతా 2001లో 27 మందికి పట్టాలు ఇచ్చారని చెప్పడంపై వివాదాస్పద భూమిలో రెవెన్యూ అధికారులు పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికీ ఈ విలువైన భూమిపై అటు రెవెన్యూ, ఇటు వెంకటరమణారెడ్డి, ఆయన నుంచి కొనుగోలు చేసిన వ్యక్తి సహా తాజాగా తమకు పట్టాలు ఇచ్చారని చెబుతున్న రజకులు కూడా కోర్టుకు వెళ్లారు. ఈ భూమిపై కోర్టులో కేసు నడుస్తుండగా, తరచూ అక్కడికి వెళ్లి గుడిసెలు వేయడం, నిర్మాణాలు చేపట్టడం, వివాదాలు సృష్టించడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఆర్‌ఐ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నెలన్నరోజుల కిందట రజకసంఘం నేతలు భూమిని చదును చేస్తుండగా, తాము అడ్డుకుని హైకోర్టుకు స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చామని, తిరిగి శుక్రవారం ప్లాస్టిక్ పట్టలతో గుడిసెలు వేయగా తొలగించామన్నారు. ఇది వంక పోరంబోకు భూమి అని, దీన్ని ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని ఆర్‌ఐ పేర్కొన్నారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

వాల్మీకిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేయకుండా బీడుగా ఉండే పంట పొలాల్లో వర్షాధార పంట ఉలవల సాగుకు రైతులకు 80శాతం రాయితీతో అందజేస్తామని వాల్మీకిపురం ఏఓ మురళీ మోహన్ పేర్కొన్నారు. మండలానికి 350క్వింటాళ్ల విత్తనాలు కేటాయించారని ప్రతి రైతు సేవా కేంద్రం నుంచి 20 నుంచి 25 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఉలవలు కిలో రూ.56 80శాతం రాయితీతో రూ.11.20 మాత్రమేనన్నారు.

రైతులకు అందుబాటులో...

బి.కొత్తకోట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండల రైతులకు సబ్సిడీ ఉలవలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలానికి ప్రస్తుతం 350క్వింటాళ్ల ఉలవలు రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గురువారం బీరంగి గ్రామంలో కూటమి నేతలతో కలిసి రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



కలికిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల గణిత శాస్త్ర విభాగం సహాయ అధ్యాపకుడు ఎల్.రాజేంద్ర ప్రసాద్‌కు పీహెచ్‌డీ పట్టా లభించింది. కర్నూలు రాయలసీమ విశ్వవిద్యాలయం ఈ మేరకు డాక్ట రేట్‌ను గురువారం వర్శిటీలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. గణితంలో ఎంహెచ్‌డీ ఫ్లోస్ త్రూ పోరస్ మీడియం' పై ఆయన సమర్పించిన పరిశోధనా పత్రాన్ని వర్సిటీ ఆమోదించింది. రాజేంద్ర ప్రసాద్‌ను సహచర అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థి ఆచూకీ లభ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి అదృశ్యమైన ఏడేళ్ల విద్యార్థిని ఆచూకీ రెండు గంటల్లోనే పోలీసులు కనిపెట్టారు. శుక్రవారం రంగారెడ్డి కాలనీకి చెందిన శశికుమార్ కుమార్తె అంజలీగ్రేస్, ఎన్‌జేఆర్ పాఠశాల నుంచి అదృశ్యమైంది. వన్ టౌన్ సీఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు తమ సిబ్బందితో బృందాలుగా వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన రెండు గంటల సమయంలోనే రాజంపేటలో విద్యార్థిని ఆచూకీ తెలుసుకున్నారు. బాలిక పెద్దమ్మ తీసుకెళ్లినట్లు గుర్తించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు పోలీసులు అప్పజెప్పారు.

బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయంపై సంబరాలు

తంబళ్లపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంపై శుక్రవారం తంబళ్లపల్లెలో బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలందరూ గౌరవిస్తున్నారని, అందుకు బీహార్ ఎన్నికలే ఉదాహరణగా వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మగ్గాలు లక్ష్మయ్య, స్టోర్ సుబ్బయ్య, హరినాథరెడ్డి, రాఘవరెడ్డి, రామస్వామి రెడ్డి, కొటాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ములకలచెరువులో...

ములకలచెరువు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కుటమి ఘన విజయం సాధించడంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బస్టాండు సర్కిల్‌లో భారీ ఎత్తున బాణ సంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కో ఆపరేటీవ్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జయరాంరెడ్డి, నేతలు సదాశివ, మల్లేశ్ నాయక్, రాఘవాచారి, వెంకటరమణ, విజయభారతిరెడ్డి, సుధాకర్, సోమశేఖర్, రామచంద్రారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డుకు సాయిబాబా స్కూల్

పీలేరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ ఫీడ్ సంస్థచే జాతీయ స్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి పీలేరు శ్రీసాయిబాబా స్కూల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ సురేంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏటా బ్రెయిన్ ఫీడ్ సంస్థ అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన పాఠశాలలకు జాతీయ స్థాయిలో అవార్డులు ఇస్తారని, ఈ ఏడాది సాయిబాబా స్కూల్‌ను ఎంపిక చేశారన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

వాల్మీకిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొనడంతో శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. గంగాదొడ్డి వాసి శ్రీరాములు శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వాల్మీకిపురానికి వస్తుండగా మార్గమధ్యలో ఆటో ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డిపల్లెలో అయ్యప్పస్వామి అంబలం పూజ

వాల్మీకిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వడ్డిపల్లెలో శుక్రవారం అయ్యప్పస్వామి అంబలం పూజ నిర్వహించారు. సాయంత్రం విశేష పుష్పాలంకరణలతో అంబలం తీర్చి పూజా కార్యక్రమాలు చేశారు. అయ్యప్ప భక్తుల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచం ద్రారెడ్డి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమాల్లో గురు స్వాములు అన్నయ్య, చంద్రశేఖర్, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ భూమి స్వాధీనం

రామసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కురిజల గ్రామంలోని చెన్నరాయస్వామి ఆలయ భూమిని దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 5సర్వే నెంబర్లకు సంబంధించి 2.25ఎకరాల భూమిని కురిజల గ్రామస్తుడు దురాక్రమణ చేయగా అధికారులు గతేడాది నవంబరులో భూమిని స్వాధీనం చేయడానికి వెళ్లగా అప్పటికే పంట సాగులో ఉన్నందున పంట పూర్తి అయ్యేవరకు సమయమిచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎండోమెంట్ అధికారులు, పోలీసుల సాయంతో భూమిని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

వాల్మీకిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాల్మీకిపురం ప్రభుత్వ గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

పీలేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 58వ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం పీలేరులో ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి అమరనాథ్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్, ప్యారూఖాన్, మనోహర్, రెడ్డి కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కలకడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక ప్రియులందరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం వెంకటరమణ అన్నారు. 58వ వారోత్సవాల ప్రారంభం సందర్భంగా శుక్రవారం లైబ్రేరియన్ అమరనాథ్ మాట్లాడుతూ పని వేళల్లో గ్రంథాలయంలోని దినపత్రికలు, పుస్తకాలను చదివి ప్రజలు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, పాఠకులతో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.